ప్రజాశక్తి

శనివారం 23 నవంబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఆ నీరు సురక్షితమేనా ?

◆ క్లోరినేషన్ చేయకుండా సరఫరా
◆ నీలం తుపానుకు దెబ్బతిన్న పరికరాలను నేటికీ పునరుద్ధరించని ప్రభుత్వాలు
◆ హోం మంత్రి అనిత నియోజకవర్గంలో పరిస్థితిదీ..

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

విజయనగరం జిల్లా గుర్లలో కలుషిత నీటితో సంభవించిన మరణ విషాదంతోనైనా ప్రభుత్వం మేల్కొన్నట్లు లేదు. రాష్ట్ర హోం శాఖ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలోని కోటవురట్ల, ఎస్.రాయ వరం, నక్కపల్లి మండలాల్లోని 37 గ్రామాల్లో 34 వేల మందికి వరహా నది నీటిని పూర్తి స్థాయిలో శుద్ధి చేయకుండా సరఫరా చేస్తున్నారు. కేవలం బ్లీచింగ్‌తోనే సరిపెడుతున్నారు. క్లోరినేషన్ చేయడం లేదు. కేవలం బ్లీచింగ్ జరిగిన నీరు తాగడానికి అంత సురక్షితమైనది కాదని, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. 12 ఏళ్లుగా ఇది కొనసాగుతుండడం పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. కోటవురట్ల మండలం రామచంద్రాపురం వద్ద రోజూ 1.30 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేసే సామర్థ్యం కలిగిన సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని నాబార్డు నిధులు రూ.ఆరు కోట్లతో నిర్మించారు. వరహా నదిలో ఇన్‌ఫిల్ట్రేషన్ వెల్, దీనికి సమీపంలో పంప్‌హౌస్, రామచంద్రాపురం వద్ద ఓవర్‌హెడ్ ట్యాంకు ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి నీటిని దీని



రామచంద్రాపురంలోని ఓవర్ హెడ్ ట్యాంకు

పరిధిలోని గ్రామాలకు గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు సరఫరా చేస్తున్నారు.

నీలం తుపానుకు 2012 నవంబర్ 4న పంప్‌హౌస్ మునిగిపోయింది. క్లోరినేషన్ చేసే పైపులు, విడి భాగాలు, పరికరాలు దెబ్బతిన్నాయి. వాటిని బాగు చేయకపోవడం, కొత్తవి ఏర్పాటు చేయకపోవడంతో అప్పటి నుంచి ఇక్కడ మిగతా 2లో..



పంపు హౌస్‌లో పనిచేయని క్లోరినేషన్ పరికరాలు



విశాఖలో ధర్నా చేస్తున్న వాలంటీర్లు

కొనసాగించాలని వాలంటీర్ల ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వాలంటీర్లు అందరినీ కొనసాగించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎపి గ్రామ వార్డు వాలంటీర్ల సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి గంధం దీప్తి మాట్లాడుతూ నాడు చంద్రబాబు చెప్పిన మాటకు పూర్తి భిన్నంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయ స్వామి మాట తీరు ఉందన్నారు. వాలంటీర్ల వ్యవస్థ లేదని ప్రకటించడం విశ్వాస ఘాతుకమని తెలిపారు. వాలంటీర్లను కొనసాగిస్తామని గత ఎన్నికల సమయంలో పదేపదే చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. తమ సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించాలన్నారు. తమ భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వెంకటరావు, జిల్లా ఉపాధ్యక్షులు పి.మణి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు, వాలంటీర్ల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కోడూరు రాము, కె.లక్ష్మణ్, జిల్లా అధ్యక్షులు అజార్, జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు పార్వతి, వాసు, శ్యామ్, రాజు పాల్గొన్నారు.

పిఎం సూర్యఘర్, కుసుమ్ పథకాలతో ప్రయోజనాలు

▶ వార్త 2లో..

హెచ్ఎస్ఎల్‌కు రెండు అవార్డులు

▶ వార్త 2లో..

నీరందక ఆరు రోజులు

▶ వార్త 2లో..

పారిశ్రామిక అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ రకాల పారిశ్రామికవేత్తలు, ఇండస్ట్రియల్ యూనియన్లు, అసోసియేషన్ ప్రతినిధులతో జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డిఐఇపిసి) సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా తమ కృషి ఉంటుందన్నారు. పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వచ్చే వారికి అన్ని విధాలుగా సహకరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తులో ఎటువంటి పరిశ్రమలను స్థాపిస్తే ఉపయుక్తంగా ఉంటుందో జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, ఇండస్ట్రియల్ యూనియన్లు, అసోసియేషన్ ప్రతినిధులు తమ సూచనలు, సలహాలు అందించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జిఎం వి.ఆదిశేషు, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ ఎం.మురళీ మోహన్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

కల్తీ ఆహార పదార్థాల విక్రేతలపై కొరడా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగరం, జిల్లా పరిధిలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు జరిపిన తనిఖీలలో కల్తీ జరిగినవి, నాణ్యత లేనివి, ఫుడ్ సేఫ్టీ నియమాలను ఉల్లంఘించినట్లు గుర్తించినవి పరిశీలించి పలువురు విక్రేతలకు జాయింట్ కలెక్టర్, డిస్ట్రిక్ట్ అడిషనల్ మెజిస్ట్రేట్ కె.మయూర్ అశోక్ రూ.2 లక్షలా 80 వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జివిబి.నందాజీ మీడియాకు తెలిపారు. పాలు, పాల పదార్థాలు, బెల్లం, పప్పు దినుసులు, బ్రెడ్స్, సాస్, ప్యాకేజీ డ్రింకింగ్ వాటర్ అమ్మకాలు చేస్తున్న వ్యాపార సంస్థలపై ఇటీవల దాడులు నిర్వహించి, వాటికి సంబంధించిన శాంపిల్స్ సేకరించామని పేర్కొన్నారు. వాటిని స్టేట్ ఫుడ్ లేబొరేటరీకి పంపగా తాము పంపిన కొన్నింటిలో కల్తీలు ఉన్నట్లు, నాణ్యతా ప్రమాణాలు లేనట్లు, సబ్ స్టాండర్డ్‌లో ఉన్నట్లు రిపోర్టులు వచ్చాయన్నారు. వాటిని పరిశీలించిన మయూర్ అశోక్ ఈ మేరకు తీర్పు ఇచ్చారని తెలిపారు.

బాదంగీర్ సాయికి ఘన నివాళి



బాదంగీర్ సాయి పార్థివదేహం వద్ద నివాళ్లర్పిస్తున్న గంగారావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రముఖ నాటక, సినీ నటులు, రంగ సాయి నాటక సంస్థ వ్యవస్థాపకులు, రంగ సాయి నాటక గ్రంథాలయం నిర్మాత బాదంగీర్ సాయికి నగర ప్రముఖులు, కళాకారులు, సాహితీవేత్తలు శుక్రవారం ఘనంగా నివాళ్లర్పించారు. అనారోగ్యంతో సాయి గురువారం సాయంత్రం మృతిచెందిన విషయం తెలిసిందే. మురళీనగర్‌లోని ఆయన గృహంలో ఉంచిన పార్థివదేహాన్ని శుక్రవారం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిఐటియు నాయకులు కె.సత్యనారాయణ, శ్రావణ్, నాయనబాబులు సందర్శించి నివాళ్లర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. సాయి మృతికి ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రమణ, ఎం.చంటి తీవ్ర సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటక, కళా రంగానికి బాదంగీర్ సాయి ఎనలేని సేవలు అందించారని, ఆయన మృతి విశాఖ కళారంగానికి తీరని లోటని తెలిపారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు అరుణ్‌జీ, తెలుగు రమణ, దండు నాగేశ్వరరావు, వై.అప్పారావు, ఎం.ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

కరాస : కళాకారుడు, రచయిత, నాటక గ్రంథాలయ స్థాపకుడు బాదంగీర్ సాయి మృతి పట్ల ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్‌జీ హస్మి భవనంలో శుక్రవారం సంతాపం తెలిపారు.

మొదటి పేజీ తరువాయి..

ఆ నీరు సురక్షితమేనా ?

క్లోరినేషన్ ప్రక్రియ ఆగిపోయింది. ఓవర్ హెడ్ ట్యాంకుకు పంపించడానికి ముందు నది నీటిలోని క్రిమిని సంహరించే నీటి శుద్ధి పద్ధతికి స్వస్తి చెప్పారు. కేవలం బ్లీచింగ్ మాత్రమే చేస్తున్నారు. క్లోరినేషన్ చేసేందుకు ఉపయోగించే గ్యాస్ సిలిండర్, ఇంజక్టర్, ఇతర పరికరాల ఏర్పాటుకు సుమారు మూడు లక్షల రూపాయలు అవసరమని, ఈ నిధులు మంజూరు చేయాలని అధికారులు ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నారు. గత 12 ఏళ్లలో మూడు ప్రభుత్వాలు మారినా ఇందుకు నిధులు ఇవ్వలేదు. నీలం తుపానులో పైపులు దెబ్బతినడంతో కోటవురట్ల మండలంలోని పందూరు, ములగలోవ, పాత గొట్టివాడలకు ఈ పథకం నుంచి నీటి సరఫరా అప్పటి నుంచి నిలిచిపోయింది. దీంతో, ఈ గ్రామాల ప్రజలు పాత రక్షిత మంచినీటి పథకాలు, బోరు నీటిని వినియోగిస్తున్నారు. గత 12 ఏళ్లలో పాయకరావుపేట నియోజకవర్గం నుంచి గొల్ల బాబూరావు ఒకసారి, వంగలపూడి అనిత రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. గుర్ల ఘటన నేపథ్యంలో క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయాలని ఈ పథకం పరిధిలోని గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దీనిపై గ్రామీణ నీటి సరఫరా విభాగం నక్కపల్లి డివిజన్ డిఇ ఆనంద్ వద్ద 'ప్రజాశక్తి' ప్రస్తావించగా ప్రతిరోజూ బ్లీచింగ్ చేస్తున్నామని తెలిపారు. క్లోరినేషన్ పునరుద్ధరణ పనులు కొద్ది రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు.

బ్లీచింగ్ వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు

'నదిలోని ఇన్‌ఫిల్ట్రేషన్ వెల్ నుంచి పంప్‌హౌస్‌కు వచ్చే నీటిలో రోజులో ఒకటి రెండుసార్లు బ్లీచింగ్ కలపడం వల్ల పెద్ద ప్రయోజనం ఉండదు. పంప్‌హౌస్‌లోని నీటి పరిమాణాన్ని అంచనా వేసి ఆ మోతాదులో బ్లీచింగ్ వేయడం సాధ్యం కాదు. పంప్‌హౌస్‌లోకి నిరంతరం నీరు చేరుతుంది. బ్లీచింగ్ వేసిన సమయంలో ఉన్న నీటి వరకే అది పనిచేస్తుంది తప్ప, ఆ తర్వాత చేరిన నీటికి తొలిసారి కలిపిన బ్లీచింగ్ ఉండకపోవడంతో నీటిలోని క్రిములు పూర్తిగా నాశనం కావు. గ్యాస్ క్లోరినేషన్ పద్ధతిలో పంప్‌హౌస్ నుంచి వచ్చే నీరు క్లోరినేషన్ జరిగాక ఓవర్‌హెడ్ ట్యాంకుకు వెళ్తుంది. ఆ నీరు చాలా వరకు సురక్షితం' అని పేరు చెప్పేందుకు నిరాకరించిన ఓ అధికారి తెలిపారు.



ఎక్స్‌పోలోని స్టాల్ వద్ద ఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్

పిఎం సూర్యఘర్, కుసుమ్ పథకాలతో ప్రయోజనాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాకారంతో అమలవుతున్న పిఎం సూర్యఘర్, పిఎం కుసుమ్ పథకాల ద్వారా వినియోగదారులకు ఎన్నో ప్రయోజనాలు లభిస్తాయని ఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి పేర్కొన్నారు. సోలార్ వినియోగం ద్వారా పొదుపు పెరుగుతుందని, ఆర్థిక ప్రయోజనాలు కూడా ఒనగూరుతాయని అన్నారు. పిఎం సూర్యఘర్ ద్వారా సాధారణ వినియోగదారులకు, కుసుమ్ పథకం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని, కావున వాటిని సద్వినియోగం చేసుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని కోరారు. ఆంధ్రా యూనివర్శిటీ మద్దిలపాలెం మైదానంలో ఏపి సోలార్ ఎనర్జీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రీ నెక్స్ట్ పేరుతో ఏర్పాటు చేసిన సోలార్ రెన్యూవబుల్ ఎనర్జీ ఎక్స్‌పో - 2024ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎక్స్‌పో ఉద్దేశాలను, ఆవశ్యకతను తెలియజేశారు. ఈ క్రమంలో వివిధ కంపెనీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ కౌంటర్లను ప్రారంభించి సోలార్ విద్యుత్ సంబంధిత పరికరాలను పరిశీలించారు. వాటి వినియోగతీరు, ప్రయోజనాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. డిస్కమ్ పరిధిలో ప్రతి ఒక్క వినియోగదారుడికీ సోలార్ విద్యుత్ ఇవ్వాలన్నదే తమ లక్ష్యమని, దాని మేరకు విశాఖపట్టణం వేదికగా ఎనర్జీ అసోసియేషన్ సౌజన్యంతో మూడు రోజులపాటు ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, ఆంధ్రప్రదేశ్ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షులు హేమ కుమార్, జనరల్ సెక్రటరీ రామమోహన్‌రావు, ఉపాధ్యక్షులు నాగరాజు, కోశాధికారి జయబాబు, సంయుక్త కార్యదర్శి శ్రీనివాసరావు, సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షులు, ఇపిడిసిఎల్ ఎస్ఇ శ్యాంబాబు, నెడ్‌కాప్ అధికారులు, సిబిఐ, ఛాంబర్ ఆఫ్ కామర్స్, వివిధ బ్యాంకుల, కంపెనీల ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

24న సన్యాసిరావు సంస్మరణ సభ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజా రచయిత, కళాకారుడు, గాయకుడు ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు జి.సన్యాసిరావు సంస్మరణ సభ ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు జరుగుతుందని ప్రజానాట్య మండలి విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రమణ, ఎం.చంటి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో పాట నేనవుతా పేరుతో పలు రకాల కళారూపాలు ప్రదర్శించి ప్రజా కళాకారుడు సన్యాసిరావుకు నీరాజనాలు అర్పించనున్నట్లు తెలిపారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్, ఉత్తరాంధ్ర మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని, నగరంలో ఉన్న కవులు, కళాకారులు, రచయితలు, నటులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నీరందక ఆరు రోజులు

- ఫార్మా సెజ్‌లో పరిశ్రమలు కటకట
- నేటికీ సరికాని మోటార్లు
- కొన్ని కంపెనీల్లో ఉత్పత్తి నిలిపివేత
- రూ.కోట్లలో నష్టం
- పలుచోట్ల కార్మికుల తగ్గింపు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీ (జెఎన్‌పిసి), అచ్యుతాపురం సెజ్‌లోని 250కిపైగా కంపెనీలు ఆరు రోజులుగా నీటి సరఫరాలేక విలవిల్లాడుతున్నాయి. 750 హెచ్‌పి సామర్థ్యం కలిగిన మూడు మోటార్లు ఇక్కడ పాడైన విషయం తెలిసిందే. మరమ్మతులు పూర్తిచేసి నీటి సరఫరా పునరుద్ధరిస్తామని ఎపిఐఐసి అధికారులు చెబుతున్నా సమస్య యథాతథంగా వుంది. నీటి సమస్యతో కొన్ని ఔషధ, ఇతర పరిశ్రమలు ఉత్పత్తిని నిలుపుకోగా, కొన్ని ఉత్పత్తిని తగ్గించుకున్నాయి. మరికొన్ని పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ పంపుసెట్ల నుంచి ట్యాంకు నీటిని రెండు.మూడు వేల రూపాయలకు కొనుగోలుచేసి కనీస అవసరాలకు ఆటంకం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకున్నాయి. నీటి సమస్యతో కోట్ల రూపాయల నష్టం వాటిల్లినట్లు కంపెనీ ప్రతినిధులు 'ప్రజాశక్తి'కి తెలిపారు.

ఉత్పత్తి నిలిపివేసిన, తగ్గించిన కంపెనీల్లోని కొందరు యజమానులు కాంట్రాక్ట్, డైలీవేజ్ కార్మికులను ఆపేశారు. దీంతో వేలాది మందికి ఉపాధి పోయింది. చాలా కాలంగా ఇక్కడ మోటార్ల మరమ్మతులు తరచూ వస్తున్నా, వాటి నిర్వహణ, పర్యవేక్షణ సరిగా చేయలేదు. ఇప్పుడు ఆరు రోజులుగా అవి బాగవకపోవడంతో ఔషధ కంపెనీలపై నీటి సమస్య ప్రభావం తీవ్రంగా పడింది. అత్యధిక నీరు ఔషధ కంపెనీలకు అవసరముంది. ఉత్పత్తి క్రమంలో సరిపడినంత నీరులేకపోతే వచ్చే సమస్యలను గుర్తించి ఉత్పత్తిని ఆపుకున్నాయి. మోటార్ల పనితీరు, వాటి పంపింగ్ సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించి లోపాలను సరిదిద్దాల్సిన బాధ్యత ఎపిఐఐసికి వుంది. కంపెనీలకు సరఫరా చేసిన నీటి ధర పెంచినప్పటికీ, వాటికి ఆటంకం లేకుండా నీరు సరఫరా చేయడానికి తగిన ప్రత్యామ్నాయ శాశ్వత ఏర్పాట్లు మాత్రం చేయలేదు. కంపెనీలకు నీరు సరఫరా చేసే ర్యాంకీ, ఎపిఐఐసి ఆది నుంచి తగిన శ్రద్ధ తీసుకోలేదు. కంపెనీలకు రోజుకు లక్షల కెఎల్ నీరు సరఫరాచేయాల్సివుంది. ఈ సరఫరాలో ఎక్కడ లోపం తలెత్తినా ఆ ప్రభావం కంపెనీ ఉత్పత్తులపై పడుతుందని తెలిసినా తగిన జాగ్రత్తలు తీసుకోవడంలేదు.

కంపెనీల నుంచి నీటి సరఫరాకు డబ్బులు వసూలు చేయడంలో చూపుతున్న శ్రద్ధ నీటి సరఫరాపై చూపడంలేదని కంపెనీ ప్రతినిధులు వాపోతున్నారు. మరమ్మతు చేసిన కొన్ని గంటల్లోనే ఒక మోటారు మొరాయించింది. మరో రెండు మోటార్లు పనిచేయకపోవడంతో నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. సమీప ప్రాంతాల నుంచి ట్యాంకుల ద్వారా తెచ్చుకుంటున్న నీరు అవసరాలకు సరిపోక ఉత్పత్తిని క్రమంగా నిలిపివేస్తున్నాయి. ఆర్నెళ్ల క్రితం ఒకసారి, రెండేళ్ల క్రితం ఒకసారి నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తిన తరువాత కూడా సమస్య తీవ్రతను గుర్తించి సరఫరా ఏర్పాటు చేయలేదు. ఆరు రోజుల పాటు పూర్తిగా నీటి సరఫరా చేయకపోవడం ఇదే మొదటిసారని ఓ కంపెనీ ప్రతినిధి తెలిపారు.



ట్యాంకులతో నీరు తీసుకెళ్తున్న కంపెనీలు

శుక్రవారం ఉదయానికి నీటి సరఫరా పునరుద్ధరిస్తామని ఎపిఐఐసి అధికారులు చెప్పినా రాత్రి 8 గంటలకు కూడా నీరు అందించలేకపోయారు. ట్యాంకులు పంపించిన కంపెనీలకు సంపులోని నీటిని తోడి నింపి పంపిస్తున్నా సరిపోవడంలేదు. పారిశ్రామిక ప్రగతిపై పెద్దపెద్ద మాటలు చెబుతూ, కంపెనీల నుంచి భారీగా నీటికి డబ్బులు వసూలు చేస్తున్న ప్రభుత్వం... ఆరు రోజులవుతున్నా నీటి సరఫరాను పునరుద్ధరించలేకపోయింది.

కంపెనీలకు నీరు సరఫరా లేక ఉత్పత్తిని నిలిపివేసి, కార్మికులను తొలగించడంపై ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించి నీటి సరఫరాను పునరుద్ధరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి వివి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ర్యాంకీ, ఎపిఐఐసి నిర్లక్ష్యంతో నీటి సరఫరా సమస్య తలెత్తిందని వారు పేర్కొన్నారు. యుద్ధప్రాతిపదికన మోటార్ల మరమ్మతు చేయాలని, అవి పనికిరాకపోతే కొత్తవి ఏర్పాటు చేసి కంపెనీల ఉత్పత్తికి సమస్య లేకుండా ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు.



అవార్డులతో హెచ్‌ఎస్‌ఎల్ అధికారులు

హెచ్‌ఎస్‌ఎల్‌కు రెండు అవార్డులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 'లీడ్ విత్ క్వాలిటీ' థీమ్‌తో సోడేట్ నిర్వహించిన నేషనల్ లెవల్ క్వాలిటీ సర్కిల్స్ కాంపిటీషన్‌లో రాణించడం ద్వారా హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ రెండు ప్రతిష్టాత్మక అవార్డులను అందుకుంది. ఈ నెల 21, 22 తేదీలలో మైసూరులోని బైం వేదికగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో షిప్ బిల్డింగ్‌లో వెల్డింగ్‌లో సమస్యలు తగ్గించడానికిగాను హెచ్‌ఎస్‌ఎల్ రూపొందించిన పరిష్కారానికి స్పార్క్స్ టీం గోల్డ్ అవార్డును గెలుచుకుంది. అదేవిధంగా డెక్-లెవల్ డిస్టార్షన్‌లలో 52 శాతం తగ్గింపునకు, 51 శాతం మెరుగుదల సాధించినందుకు, యాక్టివ్ హీవ్ కాంపెన్సేషన్ సిస్టమ్‌ను వినూత్నంగా ఇన్‌స్టాల్ చేయడంలో కచ్చితమైన అవరోధాన్ని నిర్ధారించడం, నివారించడం, ఉత్తమ ప్రతిభను కనబరిచినందుకు హెచ్‌ఎస్‌ఎల్ అచీవర్స్ టీమ్ సిల్వర్ అవార్డును సొంతం చేసుకుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌ఎస్‌ఎల్ బృందం షిప్ బిల్డింగ్, షిప్ రిపేర్స్, సబ్ మెరైన్ రెట్రోఫిట్‌లో డ్రైవింగ్ ఎక్సలెన్స్, దాని ప్రక్రియలలో ఆవిష్కరణలను ప్రదర్శించింది.

జివిఎంసి స్థాయీ సంఘం సమావేశం వాయిదా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శుక్రవారం జరగాల్సిన మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ స్థాయీ సంఘం సమావేశం 'కోరం'కు సరిపడా సభ్యులు హాజరు కాకపోవడంతో వాయిదా పడినట్టు నగర మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. మరలా సమావేశం నిర్వహించే తేదీని ప్రకటిస్తామని, అందరూ సకాలంలో హాజరు కావాలని ఆమె తెలిపారు.

ఆధునిక పరికరాలతో దంత వైద్యం

ప్రజాశక్తి -మధురవాడ : సామాన్య ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో అధునాతన దంత వైద్య పరికరాలను ఉపయోగించి చికిత్స అందించడానికి గీతం దంత వైద్య కళాశాల, ఆసుపత్రిలో శుక్రవారం ప్రత్యేక వైద్య విభాగాన్ని ప్రారంభించారు. గీతం దంత కళాశాల ప్రజారోగ్య దంత వైద్య విభాగం పర్యవేక్షణలో నిర్వహించే ఈ చికిత్స కేంద్రంలో దంత వైద్యంతో పాటు పొగాకు తదితర ఉత్పత్తుల వాడకం ద్వారా ఎదురయ్యే నోటి సమస్యలకు కౌన్సెలింగ్‌తో పాటు చికిత్స అందించనున్నారు. ఈ వైద్య విభాగాన్ని జిమ్‌సర్ ప్రొవైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ బి.గీతాంజలి ప్రారంభించారు. నోటి ఆరోగ్యం పట్ల ప్రజలలో అవగాహన పెంచడానికి వైద్యులు కృషి చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.వి.నరసింహారావు మాట్లాడుతూ, గీతం దంత కళాశాలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రి ద్వారా ఏటా లక్ష మందికి పైగా వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. సత్వర వైద్య సేవలు అందించడానికి నూతనంగా ఏర్పాటుచేసిన విభాగం ఉపయోగపడుతుందని తెలిపారు. గీతం దంత కళాశాల, ఆసుపత్రి ప్రజారోగ్య దంత విభాగం అధిపతి డాక్టర్ మనిష్‌కుమార్ మాట్లాడుతూ, చిన్న పిల్లలు నుంచి పెద్ద వారి వరకు ప్రత్యేక వైద్య నిపుణులు చికిత్స అందిస్తారని తెలిపారు. ఆసుపత్రి పర్యవేక్షణాధికారి డాక్టర్ నాగప్రియ మాట్లాడుతూ దంత వైద్యం పట్ల పిల్లలలో అవగాహనకు ఇటీవల నగరంలోని పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించామని, త్వరలో నగరంలో వివిధ ప్రాంతాలలో దంత వైద్య పరీక్షలు, అవగాహన శిబిరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల నుంచి తీరాన్ని కాపాడాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఆక్రమణదారుల నుంచి తీర ప్రాంతాన్ని కాపాడాలని మత్స్యకార నాయకులు గంటా నూకరాజు కోరారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు మత్స్యకారులు జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారం నాటికి తొమ్మిదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా గంటా నూకరాజు మాట్లాడుతూ, తీరప్రాంతంలో నిబంధనలకు వ్యతిరేకంగా ఏర్పాటుచేసిన హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్లను తొలగించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు అల్లిపిల్లి నరసింగరావు, వాసుపల్లి కొండబాబు, దాసు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న నూకరాజు

నేటి నుంచి సయ్యద్ ముస్తాక్ అలీ క్రికెట్ మ్యాచ్‌లు

ప్రేక్షకులకు ఉచిత ప్రవేశం

ప్రజాశక్తి -మధురవాడ : విశాఖపట్నంతో పాటు విజయనగరంలో శనివారం నుంచి క్రికెట్ సంబరం ప్రారంభం కానుంది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ మ్యాచ్‌లు పిఎం.పాలెం ఎసిఎ- విడిసిఎ క్రికెట్ స్టేడియంలోనూ, విజయనగరంలోని పివిజి.రాజు కాంప్లెక్స్‌లోనూ డిసెంబర్ 5వ తేదీ వరకు జరగనున్నాయి. మ్యాచ్‌ల నిర్వహణకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఏర్పాట్లు పూర్తి చేసింది. విశాఖపట్నంలో రోజుకు రెండు మ్యాచ్‌లు, విజయనగరంలో ఒక మ్యాచ్ నిర్వహించనున్నారు.

ప్రవేశం ఉచితం

మ్యాచ్‌లను తిలకించేందుకు వచ్చే ప్రేక్షకులకు ఎసిఎ-విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం గేట్ నంబర్ 15 నుంచి ఉచిత ప్రవేశం కల్పిస్తారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎసిఎ కార్యదర్శి సానా సతీష్‌బాబు కోరారు.

క్రీడాకారుల ప్రాక్టీస్

పోటీల కోసం అసోం, రైల్వేస్, చండీగఢ్, పాండిచ్చేరి, విదర్భ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ జట్లు శుక్రవారం మైదానంలో కఠోర సాధన చేశాయి.

సూక్ష్మ నీటి సేద్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-ఆనందపురం : ప్రభుత్వం అందిస్తున్న సూక్ష్మ నీటి సేద్య పథకాన్ని రైతులు సద్వినియోగంచేసుకోవాలని డ్రిప్ ఇరిగేషన్ అధికారి మన్మధరావు కోరారు. మండలంలోని వెల్లంకి గ్రామపంచాయతీ బొడ్డపాలెం గ్రామంలో డ్రిప్ ఇరిగేషన్ పథకం ద్వారా మంజూరైన పైపులను రైతులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 5 ఎకరాలలోపు ఉన్న రైతులకు 90 శాతం రాయితీపై, ఐదు ఎకరాల పైబడి ఉన్న రైతులకు 50 శాతం రాయితీపై పైపులను ఇస్తున్నట్లు తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలనుకుంటే రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, వైస్ సర్పంచ్ శ్రీనివాసరావు, వార్డు మెంబర్లు అప్పలరాజు, రామలక్ష్మి, హెచ్ఒ జి.సోనీ, అగ్రికల్చర్ విఎఎ జి.రమేష్, ఎమ్ఐ జీవనజ్యోతి, సతీష్, గిరి రైతులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు దీపోత్సవంపై నేడు సమావేశం

ప్రజాశక్తి- పద్మనాభం : ఏటా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అనంతపద్మనాభస్వామి కొండ దీపోత్సవ కార్యక్రమానికి ఈ ఏడాది సమయం సమీపిస్తున్నా ఏర్పాట్లపై సమావేశం జరగకపోవడంతో భక్తులు, ప్రజల్లో ఆందోళన రేకెత్తించింది. ఇటీవల పత్రికల్లో వచ్చిన వార్తలకు స్పందించో లేకుంటే సమయం సమీపించడంతోనో అధికారులు శనివారం కుంతీ మాధవస్వామి ఆలయంలో స్థానిక ఎమ్మెల్యే సమక్షంలో సమావేశం ఏర్పాటు చేయటానికి ఏర్పాటుచేస్తున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని ఆలయ సిబ్బంది ఫోన్ల ద్వారా కోరుతున్నారు.

5500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో పండిన వరి పంటను 5500 మెట్రిక్ టన్ను ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి లక్ష్యంగా తీసుకున్నామని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంచి.చలం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను మద్ది, అనంతవరం, పాండ్రంగి, కృష్ణాపురం, పొట్నూరు గ్రామాల్లో ఏర్పాటుచేశామని వివరించారు. రైతుల నుంచి సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీ నుంచి ప్రారంభిస్తామని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పాండ్రంగి పంచాయతీ పరిధి కుర్రపల్లి గ్రామంలో శుక్రవారం ఎస్ఒఎస్ కుటుంబ బలోపేత కార్యక్రమం ద్వారా మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఎస్.జయసాయిచందు, కంటి నిపుణులు ఎల్ రాజు తనిఖీలు నిర్వహించారు. మహిళలు, వృద్ధులు, పిల్లలు తనిఖీలు చేసి మందులు ఉచితంగా అందించారు.

అక్షరాస్యులుగా చేసేందుకే 'ఉల్లాస్'

ప్రజాశక్తి -భీమునిపట్నం : గ్రామ మహిళా స్వయం సహాయక సంఘాల్లో ఉన్న సభ్యులు 15 ఏళ్ల అంతకంటే ఎక్కువ వయస్సు కలిగి మధ్యలో చదువు ఆపేసిన, చదువుకోని వారిని గుర్తించి అక్షరాస్యులుగా తయారు చేయడమే 'ఉల్లాస్' (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) పథకం ఉద్దేశమని ఎంపిడిఒ ఎన్.హనుమంత రావు తెలిపారు. స్థానిక ఎండిఒ కార్యాలయంలో శుక్రవారం టిఒటిలు, విఒఎలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎపిఎం జి.నాగభూషణరావు, సిసిలు మీసాల అప్పల నారాయణ, భాస్కరరావు పాల్గొన్నారు.

కళా సాహితీ సంస్థకు మైక్‌సెట్

ప్రజాశక్తి -భీమునిపట్నం : కళా సాహితీ సంస్థ వ్యవస్థాపక సభ్యులు కీర్తిశేషులు కాళ్ల నారాయణరావు జ్ఞాపకార్థం అతని కుమారుడు కాళ్ల సన్నీ తన సొంత నిధులతో సమకూర్చిన మైక్‌సెట్, స్పీకర్‌ను స్థానిక కళా సాహితీ సంస్థకు శుక్రవారం అందజేశారు. ఇందుకు గాను సన్నీ, అతని కుటుంబ సభ్యులను కళా సాహితీ సంస్థ ప్రతినిధులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళా సాహితీ సంస్థ అధ్యక్షులు పి.రాజేంద్రప్రసాద్‌వర్మ, ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎల్‌వివి. విద్యాసాగర్, జి.పార్వతీశం, వి.సత్యనారాయణ, ఎం.గోపి, ఎం.సూర్యశ్రీనివాస్ పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధి నివారణ శిబిరం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం సింగనబంద పంచాయతీ మద్దిలపేట గ్రామంలో దాకమర్రి పశు వైద్యాధికారి డాక్టర్ కాంతికిరణ్ ఆధ్వర్యాన శుక్రవారం గర్భ కోశ వ్యాధి నివారణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు హాజరై మాట్లాడుతూ, పాడి రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. పశుసంవర్ధక శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్, భీమిలి డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటరమణ, ఆర్.తాళ్లవలస పశు వైద్యాధికారి డాక్టర్ ఎస్‌జి.ప్రశాంతి, పశు వైద్యాధికారులు సౌజన్య, అనిల్ తదితరులు పాల్గొని 54 మంది రైతులకు చెందిన 72 పశువులకు, దూడలకు వివిధ రకాల గర్భకోశ వ్యాధులకు అధునాతన హార్మోన్ ఇంజెక్షన్లు వినియోగించి చికిత్స చేశారు. గడ్డి పెంపకంలో మెళకువలు, పద్ధతులను వివరించారు.

సిసి రోడ్లకు భూమి పూజ

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని బుద్ధివలస అగ్రహారం గ్రామపంచాయతీ పరిధి బుడ్డవలసలో రూ.15 లక్షలతో శ్మశానవాటికకు పది అడుగుల వెడల్పుతో 400 మీటర్లు సిసి రోడ్డు, అనంతవరం గ్రామంలో గొల్లలపాలెం రోడ్డుకు రూ.15 లక్షలతో రింగ్‌రోడ్డు ఏర్పాటుకు శుక్రవారం జనసేన భీమిలి ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్‌కుమార్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు కె.రామస్వామినాయుడు, యుబి.నాయుడు, పి.సారథి, వి.శ్రీనుబాబు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

ప్రజాశక్తి -ములగాడ : కోరమాండల్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల డిమాండ్లు వెంటనే అమలు చేయాలని కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కంపెనీలో జీతాలు సక్రమంగా ఇవ్వటం లేదన్నారు. కంపెనీలో ఉన్న మీల్స్ క్యాంటిన్‌లో నాణ్యమైన భోజనం అందించాలని, సీనియార్టీ ప్రకారం ప్రమోషన్లు కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేరాలు ఘోరాలు

శారదా నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లిని ఆనుకుని ప్రవహిస్తున్న శారదానదిలో గుర్తు తెలియని వృద్ధుని మృత దేహం శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దేవరాపలి-పినకోట రోడ్డుకి ఆనుకుని నదిలోని నీటిలో మృతదేహం తేలియాడుతుండగా, స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం తెలియజేశారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించారు. వృద్ధుడు ఏ గ్రామానికి చెందిన వాడో ఎవరూ గుర్తించలేక పోయారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు తమకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట జాతీయ రహదారి 16, నూకాలమ్మ తల్లి ఆలయం సమీపంలోని రాజీవ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాల దగ్గర గురువారం రాత్రి కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందారు. సదరు వ్యక్తి గురువారం రాత్రి రోడ్డు దాటుతున్న సమయంలో కారు ఢీకొన్నట్లు కశింకోట సిఐ అల్లు స్వామి నాయుడు తెలిపారు. మృతుడు ఎవరనేది తెలియరాలేదని, ఆచూకీ తెలిసిన వారు కశింకోట పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలని సిఐ అల్లు స్వామి నాయుడు కోరారు.

వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో చోరీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ముషిడిపల్లిలో వాసవి కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని ముగ్గురు ఆలయం గేట్ల గడులను తొలగించి ఆలయంలోకి చొరబడి రెండు హుండీలను పట్టుకుని దగ్గరిలో ఉన్న మామిడితోటలోకి వెళ్లారు. అక్కడ హుండీలను తెరిచి అందులోని నగదుతో పాటు భక్తులు అమ్మవారికి సమర్పించి కానుకల్ని తీసుకుని ఖాళీ హుండీలను అక్కడే విడిచిపెట్టి వెళ్లి పోయారు. అమ్మవారి ఆలయంలో చోరీ జరిగిన విషయాన్ని దేవరాపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వాసవి క్లబ్ అధ్యక్షుడు కొప్పాక అప్పారావు విలేకరులకు తెలిపారు. కాగా దొంగతనం జరిగినప్పుడు సీసీ కెమేరాల్లో కొంత రికార్డు అయ్యిందని ఆయన స్పష్టం చేశారు.

దోపిడీ కేసులో నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎంవిపి క్రైమ్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి బీచ్ రోడ్డులోని లుంబినీ పార్క్ సమీపంలో జరిగిన దోపిడీ సంఘటనకు సంబంధించి నలుగురు నిందితులను అరెస్టు చేసినట్టు ద్వారకా సబ్ డివిజన్ ఎసిపి ఎ.వెంకటరావు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఎంవిపి క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఆ కేసు వివరాలు వెల్లడించారు. అరిలోవ టిఐసి పాయింట్‌కు చెందిన కె.శ్రీనివాసరావు బుధవారం రాత్రి 8.30 గంటల సమయంలో తన మిత్రులతో కలిసి లుంబినీ పార్కు సమీపంలో కూర్చుని మాట్లాడుతుండగా అప్పుఘర్ ప్రాంతానికి చెందిన వాసుపల్లి నవీన్, కొమర సోమరాజు, గరికిన ఎల్లాజీ, వెంకోజిపాలెంకు చెందిన ఎద్దు రాజు అక్కడికి చేరుకుని ఘర్షణపడ్డారు. ఈ క్రమంలో శ్రీనివాసరావును గాయపరిచి రూ.320 నగదును, వాచ్, సెల్‌ఫోన్‌ను ఎత్తుకుపోయారు. బాధితుడు డయల్ 112కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయగా వెంటనే పోలీసులు అప్రమత్తమయ్యారు. గాలింపు చర్యలు చేపట్టి నిందితులను పట్టుకున్నారు. చోరీ చేసిన నగదు, వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో నవీన్‌పై గతంలో నాలుగు క్రైమ్ కేసులు, సోమరాజుపై రెండు కేసులు, ఎల్లాజీపై నాలుగు కేసులు ఉన్నాయి. మీడియా సమావేశంలో విశాఖ క్రైమ్ ఎడిసిపి మోహన్‌రావు, ద్వారకా సబ్ డివిజన్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ బంగారు పాప, ఎస్ఐ రాజు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు, నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - కొత్తకోట : రావికమతం మండలం దొండపూడి గ్రామంలో తొమ్మిది మద్యం సీసాలు, రెండు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి చోడవరం కోర్టుకు తరలించామని ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు దొండపూడిలో సిబ్బందితో వెళ్లి దాడులు చేశామన్నారు నాటుసారాతోపాటు మద్యం అమ్ముతున్న వ్యక్తిని పట్టుకున్నామన్నారు. గ్రామాలలో అనధికారికంగా నాటుసారా, మద్యం అమ్మకాలు జరిగితే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

'అక్షయపాత్ర'ను జాగ్రతి బృందం పరిశీలన

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని గంభీరం అక్షయపాత్ర వంటశాలను జాగృతి యాత్రికులు సందర్శించారు. అక్షయ పాత్ర ఫౌండేషన్ విధి విధానాలు, నిర్వహించు విధానం గురించి యాత్రికులు తెలుసుకున్నారు. అధునాతన యంత్రాలతో ఒకేసారి వేలమందికి వంటచేయడం గురించి తెలుసుకున్నారు.

పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ టెండర్లు రద్దుచేయాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను ప్రయివేటుకు ఇవ్వాలన్న టెండర్లను వాయిదా వేయడం కాదని, పూర్తిగా రద్దు చేయాలని పోర్ట్ విడిఎల్‌బి అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు జక్కన సత్యనారాయణ డిమాండ్‌చేశారు. హాస్పిటల్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆసుపత్రి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారం నాటికి 53వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ, టెండర్లను టెండర్లను ఈ నెల 8 నుంచి 22వ తేదీకి వాయిదా వేశారని, ఇప్పుడు మళ్లీ 28వ తేదీకి వాయిదా వేశారని తెలిపారు. 40 వేల మంది పోర్టు ఉద్యోగులు, కుటుంబీకులకు సేవలందిస్తున్న ఆసుపత్రిని పిపిపి పద్ధతిలో 300 పడకల మల్టీ డిసిప్లైనరీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా నిర్మాణానికి ప్రయివేట్ వారికి ఇవ్వడాన్ని అన్ని యూనియన్లు వ్యతిరేకించినా కేంద్ర ప్రభుత్వం, పోర్టు యాజమాన్యం టెండరు ఓపెన్ చేయడానికి సిద్ధమవుతున్నాయని తెలిపారు. ఈ చర్య 40 వేల మంది ఆరోగ్య భద్రతను ప్రయివేటు చేతుల్లో పెట్టడమే అవుతుందన్నారు. ప్రయివేటు యాజమాన్యం సేవలను అందించడం కంటే లాభాల కోసం మాత్రమే పనిచేస్తాయన్న విషయాన్ని గుర్తించాలన్నారు. పోర్టులో పిపిపి/బిఓటి విధానాలు విఫలమయ్యాయని గతంలో కాగ్ నివేదికల ద్వారా స్పష్టంగా తెలిసిందన్నారు. పోర్టు హాస్పిటల్ కూడా ప్రయివేటు చేతుల్లోకి వెళ్లిపోతే కార్మికులు, పెన్షనర్ల కుటుంబాలు వైద్య సౌకర్యాల నుంచి దూరమవుతాయని తెలిపారు. ఆరోగ్యం కోసం ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితులు రాకుండా, కార్మిక సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని, యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. 'మెరుగైన వైద్యం అందించడం యాజమాన్యం బాధ్యత అని, పొందడం ఉద్యోగ, కార్మికుల హక్కు' అని పేర్కొన్నారు. పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను పోర్టు సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని కోరారు. ఈ ఈ దీక్షా శిబిరంలో సిఐటియు నాయకులు బి.లక్ష్మణరావు, కె.సత్యనారాయణ, రెడ్డి, ఆర్‌ఎన్.మూర్తి, బి.జగన్, రాఘవులు, శ్రీనివాసు, కనకరాజు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న కార్మికులు

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -ఉక్కునగరం : జివిఎంసి 87వ వార్డు పరిధిలో ప్లాస్టిక్ నిషేధంపై జివిఎంసి ఆధ్వర్యాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం, ఎఎంహెచ్ఒ కిరణ్‌కుమార్ హాజరయ్యారు. కూటమి నాయకులు, జివిఎంసి సిబ్బంది, గ్రామ ప్రజలతో కలిసి గాంధీ బొమ్మ సెంటర్ నుంచి వడ్లపూడి హైవే వరకు ప్లాస్టిక్ నిషేధంపై ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ, ప్లాస్టిక్ బ్యాగ్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని, గుడ్డ లేదా నారసంచులు వాడాలని సూచించారు. ప్లాస్టిక్‌ను వాడకం వల్ల కేన్సర్ భారిన పడే అవకాశముందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు వల్ల భూమి, నీరు, గాలి, కాలుష్యం అవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజన్‌రాజ్, విజయరామరాజు, కల్లేపల్లి శ్రీనివాస్‌వర్మ, ఆనందకుమార్, గెద్దాడ రాంబాబు, కడుపుట్ల శ్రీను, చక్రి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, సచివాలయ సిబ్బంది మూర్తి, శ్రీను, తిరుమలనగర్ అసోసియేషన్ ప్రజలు పాల్గొన్నారు.

జీవనోపాధిని దెబ్బతీసే చర్యలు మానుకోవాలి

ప్రజాశక్తి -గాజువాక : తోపుడు బండ్లు, చిల్లర వ్యాపారుల జీవనోపాధికి దెబ్బతీసే చర్యలు జివిఎంసి, పోలీసులు మానుకోవాలని హాకర్స్ సంక్షేమ సంఘం (ఎఐటియుసి) జిల్లా కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, పప్పు అప్పారావు కోరారు. గాజువాక హాకర్స్ సంక్షేమ సంఘం కార్యాలయంలో శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ, సుప్రీంకోర్టు బతుకుతెరువు, జీవనోపాధి రక్షణ, క్రమబద్ధీకరణ చట్టం -2013లో జీవో తీసుకొచ్చిందని, ఈ చట్టం కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో 2014 సంవత్సరంలో గెజిట్ నోటిఫికేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా గైడ్‌లైన్స్ ఇస్తూ జోన్లు ఏర్పాటుచేయమని తెలిపిందని తెలిపారు. దీని ప్రకారం జివిఎంసి ఆధ్వర్యాన సర్వే జరిపి తోపుడుబండ్లు, చిరు వ్యాపారస్తులకు గుర్తింపు కార్డులు ఇచ్చారని గుర్తు చేశారు. తోపుడుబండ్లు, చిరు వ్యాపారస్తులకు ఉపాధి రక్షణ కల్పించకుండా, హాకర్స్ జోన్లు ఏర్పాటు చేయకుండా రోడ్లపై వ్యాపారం చెయ్యనివ్వకుండా పోలీసులు దురుసుగా ప్రవర్తించడం దుర్మార్గమన్నారు. కణితి రోడ్డు మార్కెట్లో వ్యాపారాలు చేయకుండా, అడ్డు తగలడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ సమావేశంలో ముత్తా అప్పారావు, కె.అచ్యుతరావు, ప్రసాద్, సతీష్‌రెడ్డి, జి.జానీ, ఎ.శ్రీను, వరదశంకర్, జి.రాజు పాల్గొన్నారు.

ఘనంగా గుడివాడ గురునాథరావు వర్ధంతి

ప్రజాశక్తి -గాజువాక : మింది గ్రామంలో గుడివాడ గురునాథరావు వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గురునాథరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుడివాడ అప్పన్న, గురునాథరావు మెమోరియల్ ట్రస్ట్ ద్వారా అప్పన్న కాలనీ, అక్కిరెడ్డిపాలెం, మింది గ్రామాలకు డెడ్ బాడీ ఫ్రీజర్ బాక్స్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట రామయ్య, తిప్పల గురుమూర్తి రెడ్డి, ట్రస్ట్ అధ్యక్షులు గుడివాడ అప్పలరామ్మూర్తి, గుడివాడ లతీష్, కార్పొరేటర్లు ఇమ్రాన్, ఉరుకూటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ అన్నపూర్ణ

యాంటీ బయాటిక్‌ను అతిగా వాడొద్దు

ప్రజాశక్తి -గాజువాక : యాంటీ బయోటిక్‌ను అతిగా వాడరాదని న్యూఢిల్లీ ఐసిఎంఆర్‌కు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ మైక్రో బయాలజీ హెడ్ డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు. గాజువాకలోని ఎంవిఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో 'యాంటీ బయోటిక్ యొక్క బయోఎడ్యుకేషన్, బయో మ్యాగ్నిఫికేషన్' అంశంపై శుక్రవారం సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో ఆమె మాట్లాడుతూ, యాంటీ బయోటిక్‌ను అతిగా తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గిపోతుందన్నారు. దీని వల్ల అనేక రుగ్మతలకు దారితీస్తుందని చెప్పారు. చెదల నివారణకు యాంటీ బయోటిక్‌ను ఉపయోగించటం వల్ల భూమి సారవంతం పోతుందన్నారు. ఈ సమావేశంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ వి.రామారావు, ప్రిన్సిపల్ బాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు శిక్షణ

ప్రజాశక్తి-వేపగుంట : పిఎం విశ్వకర్మ యువజన పథకం కింద రిజిస్ట్రేషన్ చేసుకున్న నాయీ బ్రాహ్మణులకు మద్దిలపాలెం, పెందుర్తి, చినముసిడివాడలో ట్రైనింగ్ క్లాసులు నిర్వహించారు.

విశాఖ డెయిరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న ఎం.రాంబాబు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ డెయిరీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.రాంబాబు డిమాండ్ చేశారు. విశాఖ కో-ఆపరేటివ్ డెయిరీ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన కార్మికుల చేపట్టిన నిరవధిక రిలే నిరాహార దీక్షలకు శుక్రవారం ఆయన మద్దతు తెలుపుతూ మాట్లాడారు. డెయిరీ కార్మికులు చేస్తున్న పోరాటం న్యాయమైనదన్నారు. కంపెనీ యాక్ట్ ప్రకారం 20 సంవత్సరాలు దాటితే రావలసిన స్థాయి జీతాలు, పిఎఫ్, క్యాజువల్ లీవులు, బెనిఫిట్స్ రాకపోవడం దుర్మార్గమన్నారు. 8 గంటల పని విధానం తర్వాత, అదనపు పనికి ఓటీ, కనీస వేతన రూ.21 వేలు చెల్లించాలని, అగ్రిమెంట్ పద్ధతిలో ఉన్న ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, సంస్థ లాభనష్టాలతో సంబంధం లేకుండా బోనస్, ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వ అమలు చేసిన వివిధ కేటగిరి ఉద్యోగుల వేతనం, ఇతర అలవెన్సులను విశాఖ డెయిరీ ఉద్యోగులకు కూడా అమలు చేయాలని, మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, విచారణ పేరుతో తొలగించిన కార్మికులందరినీ తిరిగి చేర్చుకోవాలని డిమాండ్‌చేశారు. సిఐటియు జోన్ నాయకులు ఎ.లోకేష్ మాట్లాడుతూ, 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు నేటికీ తక్కువ జీతాలు చెల్లించడం అన్యాయం అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

24న పాత గాజువాకలో భారీ ప్రదర్శన

ప్రజాశక్తి -యంత్రాంగం

గాజువాక : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 24న పాత గాజువాక నుంచి కొత్త గాజువాక వరకు భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు తెలిపారు. జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన శుక్రవారం సాయంత్రం గాజువాక సిఐటియు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రదర్శనను అనంతరం పాత గాజువాకలో బహిరంగ సభ ఉంటుందని, జయప్రదంచేయాలని కోరారు. సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండకట్టాలని పిలుపునిచ్చారు.

ఉక్కునగరం : ఉక్కు పరిరక్షణ, కార్మిక హక్కుల రక్షణ కోసం ఈనెల 24న గాజువాకలో నిర్వహించే భారీ ర్యాలీ, బహిరంగ సభలో కాంట్రాక్టు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాలు కోరాయి. ఈ మేరకు శుక్రవారం ఎల్ఎంఎంఎం పార్కులో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఉక్కులో పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందని, కార్మికులకు నెలల తరబడి జీతాలు చెల్లించకుండా ఆకలి బాధలకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఇంత జరుగుతున్నా ఎమ్మెల్యే, ఎంపీలు స్పందించడంలేదన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈ నెల 29న విశాఖ వస్తున్న సందర్భంగా స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తున్నామని, ఉక్కు ప్రైవేటీకరణ ఆపేస్తున్నామని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలలో మార్పులు చేయరాదని, కనీసవేతనం రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని, ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని తదితర డిమాండ్లతో ఆదివారం ఉదయం 9 గంటలకు గాజువాకలో జరిగే ర్యాలీ, బహిరంగ సభలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు నమ్మి రమణ, జి.శ్రీనివాసరావు, నాగరాజు, వంశీకృష్ణ, ఉరుకూటి అప్పారావు, గురునాథ్, వరహాలు, వేణు తదితరులు పాల్గొన్నారు

పంచగ్రామాల భూ సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-పెందుర్తి : పంచగ్రామాల భూ సమస్యను పరిష్కరించాలని పంచగ్రామాల సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యాన జనసేన ఎంపీ టి.ఉదయ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. 1903 సర్వే సెటిల్‌మెంట్ రికార్డులో ఉన్న రైతులు పేర్లు చూపించి, ఆ రైతులు దగ్గర కొనుక్కున్న స్థలాల్లో ఇళ్లు నిర్మించు కున్నామని, ఆ భూములకు 1996-97లో అప్పటి తహశీల్దార్ సింహాచలం దేవస్థానానికి రైతువారి పట్టాలివ్వడం వల్ల సమస్య వచ్చిందని మంత్రికి సంఘం నాయకులు వివరించారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ఈ సమస్యను వివరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి టివి.కృష్ణంరాజు, అధ్యక్షులు విబిఎన్.ప్రతాప్, వి.హనుమంతరావు, టిఎల్‌జెవి శ్రీనివాస్ పాల్గొన్నారు.

26న సదస్సు

ప్రజాశక్తి-సీతమ్మధార : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ (ఎఎంఎస్) ఆధ్వర్యాన 'సనాతన ధర్మమా - సమధర్మమా' అనే అంశంపై ఈ నెల 26వ తేదీన రామా టాకీస్ రోడ్డులోని అంబేద్కర్ భవన్‌లో సదస్సు నిర్వహించనున్నట్లు ఎఎంఎస్ అధ్యక్ష కార్యదర్శులు బొడ్డు కల్యాణరావు, జెవి ప్రభాకర్ తెలిపారు. సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం అంబేద్కర్ భవన్‌లో ఆవిష్కరించారు.

24న రన్ ఫర్ అంబేద్కర్

ప్రజాశక్తి-సీతమ్మధార : రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని భీమ్ సేన వైజాగ్ ఆధ్వర్యాన బీచ్ రోడ్డులో రన్ ఫర్ అంబేద్కర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని భీమ్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రవిసిద్ధార్థ తెలిపారు. అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఆర్‌కె.బీచ్ రోడ్ కాళి మాత గుడి నుంచి వైఎంసిఎ వద్దగల పెరియార్ విగ్రహం వరకు రన్ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో భీమ్‌సేన నాయకులు శ్రీకాంత్, జ్ఞాన శివ కుమార్, రవితేజ, రావణ్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 8 మంది ఎంపిక

ప్రజాశక్తి-పెందుర్తి : స్థానిక ఆదర్శ డిగ్రీ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 8 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపల్ ఎన్ఇ ఫ్లోరా తెలిపారు. యోకోహామా టైర్స్ కంపెనీ సెంటర్ మేనేజర్ శ్రవణ్ కుమార్ జాబ్ మేళాలో ఇంటర్వ్యూ నిర్వహించారు. 25 మంది విద్యార్థినులు హాజరయ్యారు. సరైన ఎత్తు, బరువు లేనందున పలువురు ఎంపికకాలేదు. ఈ సందర్భంగా కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టి.థియోఫిలస్ మాట్లాడుతూ, ఇది మహిళా ఉపాధికి సరైన అవకాశం అన్నారు. ఈ మేళాలో ప్లేస్మెంట్ ఆఫీసర్ జి.కమలా రాణి, మెంబర్లు కెఎస్‌ఆర్.రాజేశ్వర రావు, ఎంవి.నాగమణి, పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో బంగారు పతకాలు

ప్రజాశక్తి -ములగాడ : రంగోస్టవ్ ముంబై వారు ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి చిత్ర లేఖనం, హ్యాండ్ రైటింగ్ పోటీలలో స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ తోకాడ బ్రాంచ్ 29 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. చిత్రలేఖనంలో అవార్డులు సాధించారు. టాప్ బెస్ట్ అవార్డులు-2 గోల్డ్ -11, సిల్వర్-7, బ్రాంజ్ -6, కన్సోలేషన్ ప్రైజులు -2, మెరిట్ -2 పతకాలను సాధించారని స్కూల్ ప్రిన్సిపల్ మళ్ల వాణిశ్రీ తెలిపారు. అవార్డులు సాధించిన విద్యార్థులను, ఆర్ట్ మాస్టర్ డి.శ్రీనివాస్ మనోహర్‌ను అభినందించారు.



అంబలం పూజలో పాల్గొన్న విజయ్, సాయి కృష్ణ తదితరులు

వైభవంగా అంబలం పూజ

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక తెదేపా కార్యాలయం వెనుక గ్రౌండ్స్‌లో గురువారం రాత్రి జరిగిన అయ్యప్ప స్వామి అంబలం పూజ ఘనంగా జరిగింది. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయి కృష్ణ నేతృత్వంలో చేపట్టిన ఈ భారీ అంబలం పూజ కార్యక్రమానికి మునగపాక గ్రామంతో పాటు ఎలమంచిలి, అనకాపల్లి, మాడుగుల, రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ తదితర గ్రామాల నుండి అయ్యప్ప మాలదారులు హాజరయ్యారు. పురోహితులు, గురుస్వామి వెలవలపల్లి కోటేశ్వర శర్మ అగ్ర భాగాన నిలిచి పూజా కార్యక్రమాన్ని నడిపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, టిడిపి నేతలు దాడి జైవీర్, ఆడారి మంజు పలువురు భక్తులు పాల్గొన్నారు.

అనధికార మాంసం దుకాణం తొలగింపు

ప్రజాశక్తి-పరవాడ : మండల కేంద్రం పరవాడ ప్రభుత్వ ఆసుపత్రికి ఆనుకొని అనధికార నిర్వహిస్తున్న మటన్ దుకాణాన్ని శుక్రవారం రెవెన్యూ సిబ్బంది తొలగించారు. ఈ మటన్ దుకాణం నడుపుతున్న షేక్ ఇస్మాయిల్‌పై పరవాడ పిహెచ్‌సి హెల్త్ ఆఫీసర్, పరవాడ గ్రామానికి చెందిన ఆర్‌ఆర్ నాయుడు జిల్లా కలెక్టర్‌కు, తహశీల్దారుకు ఫిర్యాదు చేశారు. ఇక్కడ మటన్ షాపు నడపడం వలన ఈ ప్రాంతమంతా దుర్గంధంగా వెదజల్లడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారని, ఆ మటన్ షాప్ తొలగించాలని ఆ ఫిర్యాదులో కోరారు. దీంతో తహశీల్దారు మటన్ షాపు యజమాని షేక్ ఇస్మాయిల్‌కు నోటీసు ఇవ్వగా, దానికి ఆయన ఎటువంటి సమాధానం ఇవ్వలేదు. దీంతో శుక్రవారం తహశీల్దారు ఎస్‌వి అంబేద్కర్ ఆదేశాలతో వీఆర్వో సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది పోలీసు బందోబస్తుతో మటన్ షాపును తొలగించారు. మళ్లీ మటన్ షాపు ఏర్పాటు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మంత్రి రవీంద్రను కలిసిన నాగజగదీష్

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రను శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లాలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను వివరించారు. అనకాపల్లి జిల్లా పర్యటనకు రానున్నట్లు రవీంద్ర నాగ జగదీష్‌కి తెలిపారు.

అందుబాటులో వ్యాక్సిన్

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రతిచోట ప్రతి సమయంలో అందుబాటులో వ్యాక్సిన్లు ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎంఎస్‌వికె బాలాజీ తెలిపారు. స్థానిక జిల్లా ఎన్టీఆర్ ఆసుపత్రుల గురు శుక్రవారాల్లో ప్రతిచోట ప్రతి సమయంలో వ్యాక్సిన్లు అందుబాటు కార్యక్రమాలపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమం ప్రపంచ ఆరోగ్య సంస్థ విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయ సర్వే లైన్స్ అధికారి డాక్టర్ జాన్ జూడో జాషువా, ఐక్యరాజ్యసమితి అభివృద్ధి సంస్థ ప్రోగ్రాం ఆఫీసర్ కమలాకర్ భట్టు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ కే చంద్రశేఖర్ దేవ్ పర్యవేక్షణలో జరిగింది.

ప్రభుత్వ భూమిని పరిరక్షించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన క్రషర్ యాజమాన్యంపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని తహశీల్దారు విజయ్ కుమార్‌కు మామిడిపాలెం గ్రామ సర్పంచ్ పూడి పరదేశి నాయుడు శుక్రవారం ఫిర్యాదు చేశారు. అనకాపల్లి మండలం మామిడి పాలెం గ్రామం సర్వేనెంబర్ 122, 126 ఉన్న ప్రభుత్వ భూమిని గత ప్రభుత్వంలో అంజనీ స్టోన్ క్రషర్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించి వ్యాపారం చేస్తున్నారని, క్రషర్ యజమానిపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

24న బ్రాహ్మణ సేవా సంఘం వన సమారాధన

ప్రజాశక్తి-అనకాపల్లి : కొసింకోట ప్రమీల గార్డెన్లో అనకాపల్లి నియోజకవర్గం బ్రాహ్మణుల వన సమారాధన కార్యక్రమం ఈనెల 24వ తేదీన నిర్వహిస్తున్నట్లు అనకాపల్లి బ్రాహ్మణ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు గొరిపతి, గంటి రవికుమార్ తెలిపారు. స్థానిక జర్నలిస్ట్ క్లబ్లో శుక్రవారం వారు మీడియా సమావేశం మాట్లాడుతూ బ్రాహ్మణులు ఐక్యమత్యం చాటుకొనుట, కష్ట సుఖాల్లో తమ సంఘం ఎప్పుడు ముందు ఉంటుందని తెలిపారు.

26న దేశవ్యాప్త నిరసనలను జయప్రదం చేయాలి

సిఐటియు, వ్యకాస, రైతు, ప్రజా సంఘాల నేతలు విస్తృత ప్రచారం



అచ్యుతాపురం సంతలో ప్రచారం చేస్తున్న సిఐటియు, ఐద్వా నేతలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపుమేరకు ఈ నెల 26న జరుగు దేశవ్యాప్త నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సిఐటియు అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము పిలుపునిచ్చారు. ఈ మేరకు అచ్యుతాపురం వారపు సంతలో శుక్రవారం విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ కార్మిక, కర్షక, ఉద్యోగ వర్గాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధిక భారాలు మోపుతున్నాయన్నారు. నిత్యావసర సరుకులు ధరలు ఆకాశాన్ని అంటాయని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అప్పులు తీర్చలేక ఆర్థికపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి, 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి, సిఐటియు మండల కన్వీనర్ కె సోమునాయుడు, నాయకులు నూకరాజు, మహేష్ పాల్గొన్నారు

కె.కోటపాడు : కార్మిక, కర్షక సమస్యలపై దేశవ్యాప్త నిరసనల్లో భాగంగా ఈ నెల 26న అనకాపల్లి నెహ్రూచౌక్ కూడలి వద్ద జరుగు మహాధర్నాను జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని ఆనందపురం, వారాడ, వి.సంతపాలెం గ్రామాలలో ఆటో, ముఠా కార్మికులతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రచారం చేశారు. ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు కె.కోటపాడులో ఉపాధి హామీ కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇచ్చి బ్యాంకు రుణాలు ఇప్పించాలని, 50 సంవత్సరాలు దాటిన వ్యవసాయ కార్మికులకు, రైతులకు నెలకు రూ.10 వేలు పింఛన్ ఇవ్వాలని, రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

సబ్బవరం : మండల కేంద్రంలో శుక్రవారం కళాసీలతో సమావేశం ఏర్పాటు చేసి 26న నిరసనల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఉప్పాడ సత్యవతి మాట్లాడుతూ ఢిల్లీ రైతాంగ పోరాటం సందర్భంగా ప్రధాని మోడీ రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కేరళ వామపక్ష ప్రభుత్వం తరహాలో దేశ వ్యాప్తంగా రుణం విమోచన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, స్మార్ట్ మీటర్స్‌ను వెనక్కి తీసుకోవాలని, విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు రైతులు, కళాసీలు పాల్గొన్నారు.

చీడికాడ : కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26న జిల్లా కేంద్రం అనకాపల్లిలో చేపట్టే మహార్యాలీ, నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని చీడికాడ మండల సిఐటియు కార్యదర్శి రొంగలి దేమున్నాయుడు పిలుపునిచ్చారు దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి పరిపాలన చేస్తుందని దుయ్యబట్టారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ, విద్యుత్ సవరణ చట్టం రద్దు, కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్, ధరలు, ఛార్జీల భారం తదితర సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపడుతున్నట్లు వెల్లడించారు.

ఎంవిపి.కాలనీ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై ఈ నెల 26న విశాఖ రైల్వే డిఆర్ఎం కార్యాలయం నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు జరిగే నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పిలుపునిచ్చారు. గురువారం మద్దిలపాలెం ఆటోమోటివ్ వద్ద ముఠా కళాసీల జనరల్ బాడీ సమావేశం జరగ్గా దానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాలకుల తీరును వివరించారు. ముఠా కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బారావు మాట్లాడుతూ ముఠా కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్‌తో కూడిన సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణారావు, మేస్త్రీలు రమణ, శ్రీను, రెడ్డి, నరసింహ, కృష్ణ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 26న జరిగే నిరసన ప్రదర్శన, బహిరంగ సభలను జయప్రదం చేయాలని కోరుతూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఎఐటియుసి ఆధ్వర్యాన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సంఘం నాయకులు ఎం.మన్మథరావు, రహిమాన్ పాల్గొన్నారు.

నేడు బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 26న దొండపర్తి డిఆర్ఎం కార్యాలయం నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే నిరసన ప్రదర్శన, సభను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం ఉదయం 10 గంటలకు జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి బైక్ ర్యాలీ చేపట్టామని, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.



ఆటో కార్మికులతో మాట్లాడుతున్న రైతు నాయకులు నాయనబాబు



స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ప్రారంభం

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ - 2024ను కైలాసగిరి పోలీస్ పెరేడ్ మైదానంలో శుక్రవారం ఎస్పీ తుహిన్ సిన్హా క్రీడా పతాకం పావురాలను ఎగరవేసి ప్రారంభించారు. ఈ పోటీల్లో అనకాపల్లి, పరవాడ, నర్సీపట్నం, సబ్ డివిజన్స్, ఆర్మ్ రిజర్వ్ పోలీసు అధికారులు, సిబ్బంది మార్చ్ పాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 22, 23 తేదీలలో జరిగే వ్యక్తిగత, జట్టు విభాగాల్లో అథ్లెటిక్స్, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీ వంటి ఆటలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. పోలీస్ వర్క్ అనేది సమిష్టితత్వంతో కూడుకున్నదని, సిబ్బంది మధ్య పరస్పర సహకారం, సమన్వయం, సమయస్ఫూర్తి ఉంటేనే విజయం వరిస్తుందని, అలాంటి స్ఫూర్తే పోలీస్ విధుల్లో కూడా ప్రతిబింబించడానికి ఈ స్పోర్ట్స్ మీట్ చాలా దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహన్ రావు, డీఎస్పీలు ఎం.శ్రావణి, కె.వి.సత్యనారాయణ, జి.ఆర్.ఆర్.మోహన్, పి.నాగేశ్వరరావు, ఇన్స్పెక్టర్లు రామకృష్ణారావు, మన్మథరావు, నరసింహమూర్తి, సంజీవరావు, జిల్లాలోని సర్కిల్ ఇన్స్పెక్టర్లు, పాల్గొన్నారు.

డిసెంబర్ నెలాఖరుకు అభివృద్ధి పనులు పూర్తి

సంబంధిత అధికారులను ఆదేశించిన జెడ్‌పి సిఇఒ



మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ నారాయణమూర్తి

ప్రజాశక్తి-దేవరాపల్లి, కె.కోటపాడు

15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను డిసెంబరు నెలాఖరులోగా పూర్తి చెయ్యాలని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిషత్ సిఇఒ పి.నారాయణమూర్తి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని దేవరాపల్లి, కె.కోటపాడు, చీడికాడ మండలాల్లో శుక్రవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఆయా మండలాల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల ప్రగతిపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 713 అభివృద్ధి పనుల కోసం 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.27 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. ఆ నిధులతో ఇప్పటి వరకు 72 పనులు పూర్తయ్యాయని, 450 పనులు వివిధ దశల్లో ఉన్నాయని, వాటిని డిసెంబరు నెలాఖరులోగా పూర్తి చేయాలని కోరారు. ఈ పనులు చేస్తున్న వారెవరూ బిల్లుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పని పూర్తయి ఎం.బుక్ రికార్డు అయిన రెండు రోజుల్లో బిల్లులు చెల్లిస్తామని తెలిపారు. పల్లెపండగ కార్యక్రమం కింద మాడుగుల నియోజకవర్గంలో 135 పనుల కోసం రూ.27.44 కోట్లు వ్యయం చేస్తున్నామని, వీట్లో 78 పనులు పూర్తి కాగా, 108 పనులు వివిధ దశల్లో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవరాపల్లి, కె.కోటపాడు ఎంపిడిఓలు సువర్ణరాజు, సాంబశివరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఈఈ చంద్రశేఖర్, ఎన్ఆర్ఈజిఎస్ ఏపీఓ డి.చంద్రకళ, ఏఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు

వినతులు స్వీకరించిన ప్రగడ నాగేశ్వరరావు

ప్రజాశక్తి-యలమంచిలి : తెలుగుదేశం పార్టీ యలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు మంగళగిరి టిడిపి ప్రధాన కార్యలయంలో శుక్రవారం జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఇటీవలే రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవికి ఎంపికైన ప్రగడ నాగేశ్వరరావు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి తగిన సూచనలిచ్చారు. వాటి పరిష్కారానికై సంబంధిత అధికార్లకు వినతులు అందజేస్తానని భరోసా ఇచ్చారు. ఇదే కార్యక్రమంలో అనకాపల్లికి చెందిన మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, యలమంచిలి సీనియర్ నాయకులు ఆడారి ఆదిమూర్తి పాల్గొన్నారు.

నేడు 5 పంచాయతీలకు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఏపీఈపీడీసీఎల్ అచ్యుతాపురం సబ్ స్టేషన్ పరిధిలో అచ్యుతాపురం, భోగాపురం, చౌడపల్లి, మోసయ్యపేట, రామన్నపాలెం గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. లెవెన్ కెవి విద్యుత్ లైన్ల కింద పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడం, విద్యుత్ స్తంభాలు కేసరాల బిగింపు తదితర పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి వడ్డాది : బుచ్చయ్యపేట మండలం బంగారుమెట్ట విశ్వబ్రాహ్మణ కాలనీలో కమిటీ హాల్ నిర్మాణానికి శుక్రవారం హౌసింగ్ ఏఈ ప్రభు స్థల పరిశీలన చేశారు. స్థలం కొలతలను కొలిచి అంచనా విలువను కట్టారు. స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు ఆదేశాల మేరకు పది లక్షల రూపాయల విలువగల కమ్యూనిటీ హాలు నిర్మిస్తున్నారు. కమ్యూనిటీ హాల్ త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు ఆయన వెంట మాజీ సర్పంచ్ తమరాన దాసు, ఎంపీటీసీ యాల్లపు జగ్గారావు, వర్క్ ఇన్స్పెక్టర్ దర్గా ప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వాల వైఫల్యాలను ప్రచారం చేయాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలలో ప్రచారం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మీసాల సుబ్బన్న కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలోని పూడి వైఎస్ఆర్ నగర్ పునరావాస కాలనీలో శుక్రవారం తనకాల అనంతరావు అధ్యక్షతన జరిగిన సమన్వయకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సుబ్బన్న మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రతిపక్ష పాత్ర లేకపోవడం ఆ పాత్రను కాంగ్రెస్ పార్టీ పోషిస్తుందని చెప్పారు. జిల్లాలో పలు నియోజకవర్గాలకు ఇటీవల నియమించిన సమన్వయకర్తలకు ఆయన చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం, అనకాపల్లి, పాయకరావుపేట, మాడుగుల, చోడవరం, పెందుర్తి నియోజకవర్గం సమన్వయకర్తలు చినబాబు, ఎం.చక్రవర్తి, ఎం కోటేశ్వరరావు, పి కొండలరావు, ఎం వి ఆర్ రాహుల్, పోలమర శెట్టి ఆదిమూర్తి కాంగ్రెస్ నాయకులు సంజీవ్ పాల్గొన్నారు.

పెద్ద చెరువు ఆక్రమణపై తహశీల్దారు పరిశీలన

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని బయ్యవరం గ్రామంలో ఉన్న పెద్ద చెరువు ఆక్రమణపై కలెక్టర్‌కు అందిన ఫిర్యాదు మేరకు శుక్రవారం తహశీల్దారు అడబాల శ్రీనివాసరావు పరిశీలించారు. సర్వే నిర్వహించి రాళ్లు పాతారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తహశీల్దారు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసరావు, విఆర్ఓలు నారాయణ రావు, తుమ్మపాల శ్రీనివాసరావు, కొల్లి సత్యారావు, ఇరిగేషన్ డిపార్టుమెంటు జెఇ అమూల్య పాల్గొన్నారు.

కోర్టు భవనాలను పునర్నిర్మించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి-యలమంచిలి : పురాతన యలమంచిలి కోర్టు కాంప్లెక్స్ శిథిలావస్థలో ఉందని, దానిని పునర్నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ రాష్ట్ర న్యాయశాఖ మంత్రి మహమ్మద్ ఫరూక్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడ సచివాలయంలో మంత్రిని కలిశారు. కోర్టు భవనాలు నిర్మిస్తే స్పోర్ట్స్ కాంప్లెక్స్ పూర్తి స్థాయిలో క్రీడాకారులకు అందుబాటులో ఉంటుందన్నారు. దీనికి మంత్రి ఫరూక్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

పరిశ్రమలకు నీటి సరఫరా చేయాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-పరవాడ

ఫార్మాసిటీలో పరిశ్రమలు 98, అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లో 200 పరిశ్రమలు గత ఐదు రోజులుగా నీటి సరఫరా లేక ప్రైవేటు ట్యాంకర్లపై ఆధారపడి నడుపుతున్నాయని, వెంటనే ఏపిఐఐసి అధికారులు నీటి సరఫరా చేయడానికి చర్యలు చేపట్టాలని సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. పరవాడ ఫార్మసిటీలో శుక్రవారం ఆయన పర్యటించారు. పరిశ్రమలు నీటి కష్టాలను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ఏపీఐఐసీ మరమ్మతులు గురైన మోటార్ రిపేరింగ్ చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఏపిఐఐసి అధికారులు నిర్లక్ష్యం రాంకీ యాజమాన్యం బాధ్యతారాహిత్యం కారణంగానే పరిశ్రమలకు నీటి కష్టాలు ఏర్పడ్డాయని తెలిపారు. పరిశ్రమల్లో ఒకవైపు నీరు లేక మూతపడుతున్నాయని, కొట్లది రూపాయలు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకొని మూడు మోటార్లను మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.



ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను పరిశీలిస్తున్న సిఐటియు నేతలు

ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ శుక్రవారం అనకాపల్లి డిపో వద్ద స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యుఎఫ్ అనకాపల్లి డిపో అధ్యక్షులు బి.అప్పారావు, కార్యదర్శి పి.ఎన్.వి.వరమేశ్వరరావు, సిఐటియూ జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు మాట్లాడుతూ గత ఎండి ఇచ్చిన 1/ 2019 సర్క్యులర్ విధిగా అమలు చేయాలని, ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన జీవో నెంబర్ 70, 71లు మార్పు చేయాలని, సస్పెన్షన్లు ఆపాలని కోరారు. ఉద్యోగులపై వేధింపులు, పనిష్మెంట్లు, రికవరీలు, పని భారాలు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈహెచ్ఎస్ స్థానంలో మెరుగైన వైద్య సౌకర్యం అందించాలని, నైట్ అవుట్, డే అవుట్ అలవెన్సులు ఇన్సెంటివ్ చెల్లించాలని, అద్దె బస్సులు, ఔట్సోర్సింగ్ కార్మికులకు కాల్ ఆన్ డ్రైవర్లకు టైం స్కేల్ అమలు చేయాలని, థర్డ్ పార్టీ కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి నేరుగా ఆర్టీసీ జీతాలు చెల్లించాలని, అద్దె బస్సు డ్రైవర్లకి కనీస వేతనం, పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో హైర్ బస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలకా సత్యనారాయణ, త్రిమూర్తులు, ఎస్.రమణ, ఎస్‌డబ్ల్యు.ఎఫ్ నాయకులు పాల్గొన్నారు. సిపిఎం నాయకులు తేలయ్య బాబు సంఘీభావం తెలిపారు.

మహిళలు చైతన్యం కావాలి

ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి

ప్రజాశక్తి-సబ్బవరం

మహిళల రక్షణకు ఎన్ని చట్టాలు తీసుకొస్తున్నా వారిపై అకృత్యాలు జరుగుతూనే ఉన్నాయని, స్త్రీలు తమకు తాముగా చైతన్యం కావాల్సిన అవసరం ఉందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి అన్నారు. మండల కేంద్రంలోని రేంజర్స్ డిఫెన్స్ అకాడమీ కళాశాలలో శుక్రవారం మహిళల రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పోతల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ప్రభావతి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్య కేసులను ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్లో విచారించాలని డిమాండ్ చేశారు. మహిళలు, బాలికలపై అత్యాచారాలను, లైంగిక వేధింపులను అరికట్టేందుకు కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. దీనికి ప్రభుత్వం రోడ్ మ్యాప్ కార్యాచరణను ప్రకటించాలని, సైబర్ వేధింపులు, ఆన్లైన్ వేధింపులపై అవగాహన కల్పించాలని, విద్యా సంస్థల దగ్గర పోలీసు నిఘా పెంచాలని కోరారు. బాధిత మహిళలకు పునరావాసం, మానసిక ఆలంబన కల్పించే విధంగా సఖి టీములను బలపర్చాలన్నారు. స్త్రీ, పురుష సమానత్వం కలిగే విధంగా సిలబస్ రూపొందించి బోధించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐద్వా నేత ప్రభావతి

గడ్డి కోత యంత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని నూతలగుంటపాలెం గ్రామంలో ముగ్గురు పాడి రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై మంజూరు చేసిన గడ్డి కోత యంత్రాలను శుక్రవారం సర్పంచ్ కలిగెట్ల రత్నం నాయుడు, టిడిపి కూటమి నాయకులు ఎలమంచిలి వెంకట్రావు అందజేశారు. కార్యక్రమంలో పశు వైద్య అధికారి చైతన్య మణి, పశు సహాయకుడు బి.రాజేష్, సచివాలయం సిబ్బంది నక్కిన మధు, రైతులు పాల్గొన్నారు.

3న ఎన్ఎఎస్ పరీక్ష

ప్రజాశక్తి-కశింకోట : నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వేస్ పరీక్ష డిసెంబర్ 3న జరుగుతుందని ఎంఇఒ-2 సూర్యనారాయణ మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 3, 6, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పిల్లల చదువులో నాణ్యత, చదువు స్థాయిని గుర్తించడం జరుగుతుందని తెలిపారు.

క్రమశిక్షణతో విద్య అభ్యసించాలి


ప్రజాశక్తి-సబ్బవరం : విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల ప్రార్థన సమయానికి ముందే ఆయన సందర్శించి అసెంబ్లీ నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాలల పనివేళలు సాయంత్రం 5 గంటల వరకు పెంచడంపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. వంటగది, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. వివిధ ఆటల పోటీలలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం పి.రాధాకుమారి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఏటికొప్పాక బండిమాంబ జాతర

ప్రజాశక్తి - యలమంచిలి : ఏటా ప్రతిష్టాత్మకంగా జరిగే ఏటికొప్పాక బండిమాంబ జాతర ఆదివారం ప్రారంభం కానుంది. ఉత్సవ కమిటీ జాతరకు సంబందించిన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే ప్రారంభించినట్లు పేర్కొంది. అమ్మవారి జాతరను పురస్కరించుకొని 22న కబడ్డీ, 23న వాలీబాల్ టోర్నీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసుల సహకారంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు సర్పంచ్ భజంత్రీల లక్ష్మీరాము, మాజీ సర్పంచ్ కాండ్రకోన చిరంజీవి, జనసేన పార్టీ అధ్యక్షులు అన్నం బాబ్జీ, అన్నం వెంకట్రావు తదితరులు తెలిపారు.

ఎపి కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్

ఛైర్మన్‌గా గండి బాబ్జీ పదవీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న గండి బాబ్జి, పక్కన ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి-సబ్బవరం

టిడిపి పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జి శుక్రవారం విజయవాడలోని ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ సంస్థ కార్యాలయంలో ఆ సంస్థ ఛైర్మన్‌గా గండ ప్రమాణ స్వీకారం చేశారు. దీనికి విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్ ముఖ్య అతిథిగా విచ్చేసి బాబ్జిని అభినందించారు. పెందుర్తి నియోజకవర్గం నుండి, విశాఖ నగరం నుండి పలువురు నేతలు, టిడిపి కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లి బాబ్జికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గండి బాబ్జి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఇచ్చిన పదవికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గండి దేముడు, బర్ల రమణ, కోరాడ శ్రీను, చింతల శ్రీనివాసరావు, ఎం. అక్కుబాబు, సబ్బవరం-4 ఎంపీటీసీ గొర్లి చైతన్య, బాధిరెడ్డి లక్ష్మణ, గండి దేముడుబాబు, గొర్లి గోవిండ్, బలిరెడ్డి సూర్య ప్రసాద్, బలిరెడ్డి అప్పారావు, సబ్బవరపు కుమార్, కూటమి నేతలు పాల్గొన్నారు.

గండి బాబ్జిని సత్కరించిన కన్నూరు

పరవాడ : విజయవాడ ఆటోనగర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూనె గింజల సహకార సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన గండి బాబ్జిని టిడిపి నేత, అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కన్నూరు వెంకటరమణ ఘనంగా సత్కరించారు. బాబ్జికి పదవి రావడం పట్ల వెంకటరమణ హర్షం వ్యక్తం చేశారు.


శుభాకాంక్షలు తెలియజేస్తున్న కన్నూరు వెంకటరమణ

ఏడాకుల చెట్లు తొలగించాలి



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేత అప్పలరాజు

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : మండలంలో ధర్మవరం అగ్రహారం గ్రామంలో విశాఖ డెయిరీ పాల కేంద్రం నుండి కోస్టల్ సీఫుడ్స్ కంపెనీ వరకు జాతీయ రహదారి పక్కన గల ఏడాకుల ఆకుల చెట్లను తొలగించాలని కోరుతూ మండల తహశీల్దార్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు వినతి పత్రం అందజేశారు. ఏడాకుల చెట్టు వలన పర్యావరణానికి, ప్రజలు ఆరోగ్యాలకు తీవ్రంగా నష్టం జరుగుతుందని, ఆ చెట్టు పువ్వులు, పుప్పిడి వలన శ్వాసకోశ, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు ప్రబలుతున్నాయని పర్యావరణ వేత్తలు, ఆరోగ్య నిపుణులు స్పష్టం చేసిన నేపథ్యంలో వాటిని తొలగించాలని కోరారు. దీనిపై తహశీల్దార్ స్పందించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.రాజేష్ పాల్గొన్నారు.

అధికారులకు సత్కారం



తహశీల్దార్‌ను సన్మానిస్తున్న నరసింహమూర్తి

ప్రజాశక్తి-గొలుగొండ : సమాచార హక్కు చట్టం 19వ వార్షికోత్సవంలో భాగంగా ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులకు సన్మానాలు చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎస్ఐ పి.రామారావు, ఎపిఎం కరుణానిధి, ఎంపిడిఓ మేరీరోజ్‌లను సన్మానించినట్లు ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర కార్యదర్శి జక్కు నరసింహమూర్తి తెలిపారు చారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ చట్టం అమలులో అధికారులు ఎంతో పారదర్శకంగా పనిచేస్తున్నారని ప్రజలు మనలు పొందుతూ సేవలు అందిస్తున్నారని అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దుల్లా వీరబాబు, పి.రాజా, ఉల్లి తలుపులు, తాతా రాము, ఎస్. రాము, బాబ్జి పాల్గొన్నారు

విశాఖలో మాలల మహాగర్జన

ప్రజాశక్తి -కొత్తకోట : మాల మహానాడు ఆధ్వర్యంలో వచ్చేనెల 8న ఆదివారం మధ్యాహ్నం విశాఖ వుడా చిల్డ్రన్స్ ఆవరణలో మాలల మహా గర్జన కార్యక్రమాన్ని జయ ప్రదం చేయాలని స్థానిక అంబేద్కర్ సంక్షేమ సేవా సంఘం ప్రతి నిధులు మల్లేటి రాజు, బి బుల్లిబాబు, పూడి అప్పారావు, అర్జున రావు కోరారు. శుక్రవారం కొత్తకోట అంబేద్కర్ కాలనీలో అంబేద్కర్ విగ్రహం వద్ద మాలల గర్జన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదమ్ముళ్ళ వలె కలిసి ఉన్న ఎస్‌సిలను వర్గీకరణ పేరుతో విడగొట్టడాన్ని నిరసిస్తూ ఈ ఆందోళన చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు మల్లేటి మహేష్, టొల్లల శేఖర్, జాన్ రాజ్, మరువాడ రావు, ఎన్ మొదయ్య, నెల్లూరు ప్రసాద్, ఎన్ శివ, పూడి అప్పారావు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణం పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లిలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులను తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ పరిశీలించారు. ఇప్పటివరకు ప్రహరీ గోడ లేకపోవడం వలన పాఠశాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు.రూ. 13 లక్షలతో ప్రహరీ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్ కు సూచించారుకార్యక్రమంలో రాణి లలిత, టిడిపి నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అపార్ నమోదుకు అవస్థలు

▸ ఆధార్ వివరాల్లో తేడాలతో విద్యార్థుల అగచాట్లు



ఆధార్ కేంద్రాల వద్ద సవరణలకు బారులుదీరిన విద్యార్థినులు

ప్రజాశక్తి -కోటవురట్ల: జాతీయ విద్యా విధానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పుల్లో భాగంగా ఆధార్ మాదిరిగా వన్ నేషన్, వన్ ఐడి పేరుతో 12 అంకెలతో కూడిన ఆపార్ కార్డు మంజూరుకు విద్యార్థులు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది, ఆధార్ కార్డులో జన్మించిన తేదీ, పాఠశాలల రికార్డులో ఉన్న తేదీ వ్యత్యాసం కారణంగా వాటిని సవరించుకునేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గడిచిన వారం రోజులుగా ఆధార్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. 2008-09లో ఆధార్ నమోదు మొదలుపెట్టినప్పుడు చాలామంది తమ పుట్టిన తేదీని నమోదు చేయలేదు కేవలం సంవత్సరం మాత్రమే నమోదు చేయడంతో ఇపుడు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ సిబ్బందితో ఆధార్ నమోదు కేంద్రాలు పలుచోట్ల ఏర్పాటు చేసినప్పటికీ, సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో ఆధార్ సవరణకు ప్రైవేటు ఆధార్ నమోదు కేంద్రాలను సందర్శించాల్సిన పరిస్థితి, ఉంది. ప్రస్తుతం ఆపార్‌లో నమోదు చేసేందుకు తల్లిదండ్రుల పేర్లు, ఇంటి పేరు ఇంటి నంబరు, పుట్టిన తేదీ ఇలా చాలా వరకు తప్పులు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ మార్పు చేయాలంటే జనన దవీకరణ పత్రం తప్పనిసరి కావడం అది కూడా డిజిటల్ సైన్ ఉన్న పత్రాలను పరిగణలోకి తీసుకోవడంతో మరింత సమస్య తలెత్తుతోంది, జనన ధ్రువీకరణ పత్రం కొత్తగా తీసుకోవాలంటే దాదాపు రెండు నెలల సమయం పడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు ఈ సందర్భంలో ప్రభుత్వం ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు, కాగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్ వద్ద సవరణలకు రూ.100 తీసుకుంటుండగా ప్రైవేటు ఆధార్ సెంటర్ వద్ద రూ.170 వరకు వసూలు చేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు.

కనులపండువగా వెంకటేశ్వరుని కల్యాణం



ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : మండల కేంద్రమైన ఎస్. రాయవరంలో కొలువైన వైభవ వేంకటేశ్వరుని ఆలయంలో శ్రీవారుగోదాదేవిల కల్యాణం కనుల పండువగా జరిగినట్లు ఆలయ ధర్మకర్త బొలిశెట్టి గోవిందరావుతెలిపారు. శుక్రవారం సాయంత్రం స్వామి తొమ్మిదవ వార్షిక తిరు కళ్యాణోత్సవాలలో భాగంగా ఎదురు సన్నాహం, తిరువీధి సేవతో భారీ ఊరేగింపు నిర్వహించారు. భక్తుల జయజయధ్వానాల మధ్య కోలాటాలు, తాడుపెద్ది సంబరాలతో ఊరేగింపు జరిగింది. అనంతరం స్వామి కల్యాణం జరిగింది. కార్యక్రమంలో బొలిశెట్టి శ్రీనివాసరావు కొణతాల శ్రీనువాసరావు లక్కోజు నానాజీ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


26న మహార్యాలీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గొలుగొండ : ఈ నెల 26న భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని అనకాపల్లిలో అంబేద్కర్ ఇండియా మిషన్(ఎయిమ్) ఆధ్వర్యంలో నిర్వహించే మహా ర్యాలీని జయప్రదం చేయాలని ఏయిమ్ రాష్ట్ర పైలెట్ బ్యూరో సభ్యులు సరమండ వీరబాబు, మండల అధ్యక్షులు చిట్ల అప్పారావు కోరారు. శుక్రవారం గొలుగొండ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మహా ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ఎయిమ్ కన్వీనర్ జువ్వల వరహాలబాబు, కార్యదర్శి బోదరపు అప్పారావు, కోకన్వీనర్ మెలిపాక శివ, ఐదో షెడ్యూల్ సాధానోధ్యమ నాయకులు వాడపల్లి సంజీవ్, ఏయిమ్ డిజిటల్ కన్వీనర్ నెల్లూరి చిరంజీవి, పొట్ల రాజా, డి. వీరబాబు పాల్గొన్నారు

వరి పైర్లకు తెగుళ్ల బెడద

▸ రెక్కరాల్చు పురుగుతో పంటకు తీవ్ర నష్టం

▸ సస్యరక్షణ చర్యల్లో అన్నదాతలు



పురుగు మందులు పిచికారీ చేస్తున్న రైతులు

ప్రజాశక్తి-రోలుగుంట : ఆశాజనకంగా ఉన్న వరిపంట వెన్నదశల్లో రెక్కరాల్చు పురుగు విజృంభణతో పంటను నష్టపోతున్నరైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికి అందొస్తుందనుకున్న పంట కళ్లముందే పాడౌతుండడంతో దాని రక్షణకు చర్యలు చేపడుతున్నారు. ఈ ఏడాది వర్షాలు, వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో వరి పంట బాగుందని రైతులు ఆశగా ఉన్న సమయంలో, కోతకు సిద్ధంగా సమయంలో ఆర్‌జేఎల్ రకానికి చెందిన వరి పంటకు రెల్లరాల్చు పురుగు సోకింది. రాత్రికి రాత్రే పంటను తినేయడంతో వెన్ను రాలిపోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలం పొడుగునా అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని రైతులు అంటున్నారు .దీంతో పంట రక్షణ చర్యల్లో భాగంగా క్రిమిసంహారక మందులను పిచికారీ చేస్తున్నారు. అయితే ఒకేసారి రైతులంతా మందులు పిచికారీ చేసే పరిస్థితి రావడంతో స్ప్రేయర్లు దొరకడం లేదని ఆవేదన, ఆందోళన చెందుతున్నారు.

రాయితీపై అపరాల విత్తనాలు

ప్రజాశక్తి- మాడుగుల : మండలంలోని రైతులకు రాయితీపై పంపిణీకిమినుములు, పెసర విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి ఎం వాసుదేవరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రం వద్ద అపరాల విత్తనాలు పంపిణీ చేపట్టారు.65 క్వింటాళ్ళ మినుములు, 35 క్వింటాళ్ళ పెసర విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని రైతులు పట్టదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డుతో రైతుసేవా కేంద్రాలను సంప్రదించి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యడ్ల కలవతి, ఎంపిటిసి పి. విజయలక్ష్మి, స్థానిక నాయకులు శ్రీనాధు శ్రీనివాసరావు, పి .రమేష్, ఎజెడ్ఓ కె. వరప్రసాద్, రైతు సేవ కేంద్రం సిబ్బంది టీ.ఎం.వి. రేణుక పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని జోగంపేట రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం సబ్సిడీపై మినుములు, పెసల విత్తనాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రం అగ్రికల్చర్ అసిస్టెంట్ సత్యవేణి మాట్లాడుతూ విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ జెరాక్సులు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సింహాద్రి, మాజీ సర్పంచ్ సుర్ల సీతారామ్మూర్తి, వైసీపీ నాయకులు జువ్వల దేముడు పాల్గొన్నారు. అదే విధంగా ఏఎల్ పురం సచివాలయం-2లో ఎంపిపి గజ్జలపు మణికుమారి, సర్పంచ్ లోచల సుజాత అపరాల విత్తనాలను పంపిణీ చేశారు.

విపత్తుల నిర్వహణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : అకస్మాత్తుగా వచ్చే విపత్తుల పట్ల అవగాహన లేకపోవడంతో అపార నష్టం వాటిల్లుతుందని ఎన్‌డిఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ జిడి సత్యన్నారాయణ అన్నారు. శుక్రవారం అడ్డురోడ్డులోని శ్రీ ఆదర్శ హైస్కూల్ విద్యార్థులకు ప్రకృతి విపత్తులపై అవగాహన కల్పించారు. 10 వ బెటాలియన్ కమాండెంట్ వి వి ఎన్ ప్రసన్నకుమార్ సూచనలతో విశాఖపట్నం నుండి వచ్చిన ఎన్‌డిఆర్ఎఫ్ బృందం సభ్యులు వరదలు, అగ్నిప్రమాదాలు, భూకంపాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రయోగాత్మకంగా వివరించారు. ఈనెల 27 వరకు అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను చేపడతామన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు జె రమేష్ బాబు, ఎస్ఐ విభీషణరావు, యలమంచిలి అగ్నిమాపక సిఐ రాంబాబు, సర్పంచ్ కర్రి సత్యన్నారాయణ, ఆదర్శ విద్యాసంస్థల కరస్పాండెంట్ రామరాజు, టిడిపి మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, నాయకులు కోన అప్పలరాజు, బిజెపి మండల అధ్యక్షుడు బి జోగినాయుడు జనసేన మండల అధ్యక్షుడు పప్పల శివ దమ్ములరాజు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులపై అవగాహన

నక్కపల్లి : మండలంలోని వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం మూర్తి రాజు, వృత్తి విద్య కోర్స్ ట్రైనర్ హెచ్ మహేశ్వరి ఆధ్వర్యంలో 9,10 తరగతుల విద్యార్థులకు వృత్తి విద్య కోర్సులపై ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా క్షేత్రస్థాయి అవగాహనకు స్థానిక వేంపాడు టోల్ గేట్ దరి శ్రీహర్ష ఫర్నీచర్స్ స్టోర్‌ను సందర్శించారు. అమ్మకాలు, కస్టమర్ల సర్వీసు గురించి విద్యార్థులకు వివరించారు. ఎస్ఎస్‌సి బోర్డు ఒకేషనల్ రిటైల్ సర్టిఫికెట్‌ను పదో తరగతి పాస్ అయిన విద్యార్థులకు అందజేస్తుందన్నారు. ఈ సర్టిఫికెట్ విద్యార్థులకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలకు ఉపయోగపడుతుందన్నారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి-ఎస్ రాయవరం : ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలు, వాటి లార్వాలను నియంత్రించి తద్వారా వాటిద్వారా సంక్రమించే వ్యాధులకు దూరంగా ఉండొచ్చనిజిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి పిజెఎంఆర్‌పి నాయుడు అన్నారు. శుక్రవారం డ్రైడే ఫ్రైడే సందర్భంగా పెనుగల్లు పిహెచ్‌సి పరిధిలోని గ్రామాల్లో ఆరోగ్యబోధకుడు శ్రీనివాస్, హెల్త్ సూపర్వైజర్ ఆదినారాయణ మూర్తి గృహసందర్శన చేసి, యాంటి లార్వా ఆపరేషన్ చేపట్టారు. ప్రజల్లో అవగాహనకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో షేక్ అమీర్ షాజిద్, ఎన్ సత్తిబాబు, చిలకమ్మ, భారతి పాల్గొన్నారు.

గెడ్డపోరంబోకు ఆక్రమణ తొలగింపు



ఆక్రమణ తొలగిస్తున్న తహశీల్దార్, ఎస్ఐ, అధికారులు

ప్రజాశక్తి - రావికమతం : మండలంలోని గుడివాడ పంచాయతీ శివారు పిల్లవానిపాలెం గ్రామసమీపంలో జీడిపిక్కల ఫ్యాక్టరీ యాజమాన్యం ఆక్రమించిన .గెడ్డ పోరంబోకు స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గెడ్డపోరంబోకు స్థలాన్ని ఆక్రమించి స్తంభాలు వేస్తుండగా, పిల్లవానిపాలెం గ్రామస్తులు రావికమతం తహశీల్దార్ వెంకటరమణ, ఎస్ఐ రఘు వర్మలకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన వారు సంఘటనాస్థలికి చేరుకుని ఆక్రమణలను తొలగించారు. రెవిన్యూ సిబ్బంది పరిశీలనలో సర్వే నెంబరు 338-2 లో 6.80 ఎకరాల గడ్డ పోరంబోకు ఉన్నట్లు గుర్తించి, అందులో స్తంభాలు వేస్తుండడంతో తొలగించినట్లు తెలిపారు. గెడ్డపోరంబోకులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని తహసిల్దార్ హెచ్చరించారు.

గాయపడిన విలేకరికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రెస్ క్లబ్ ప్రతినిధులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఆపరేషన్ అనంతరం ఇంటికి చేరుకున్న రిపోర్టర్ ఈశ్వర్‌కు ఎపియుడబ్ల్యుజె నర్సీపట్నం ప్రెస్ క్లబ్ తరఫున శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు స్వామి, ఎపి ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్ చింతల,జిల్లా కార్యవర్గ సభ్యులు రాము, అప్పారావు, నర్సీపట్నం ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బాబ్జి, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ నర్సీపట్నం ఏరియా అధ్యక్షుడు విజయ్, ప్రజాశక్తి శ్రీను, వైశాఖి న్యూస్ రామకష్ణ, జ్యోతి శ్రీను పాల్గొన్నారు.

బదిలీ విఆర్‌ఒకు ఘనసత్కారం



సత్కరిస్తున్న జెబి.పురం సర్పంచ్, గ్రామస్తులు

ప్రజాశక్తి- చీడికాడ : మండలంలోని జెబిపురం గ్రామ రెవెన్యూ అధికారిగా పనిచేసి, బదిలీపై వెళుతున్న డివిఎ శ్రీనివాస సన్యాసిరాజును శుక్రవారం గ్రామ పెద్దలు, సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మలు రాజబాబు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. గ్రామంలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు, విద్యార్థులకు కుల,నివాస ఆదాయ ధ్రువీకరణలు, ఇతర రెవెన్యూ సమస్యలపై సత్వరమే స్పందించి పరిష్కరించారని శ్రీనివాస సన్యాసిరాజు సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జెబి పురం గ్రామానికి పంచాయతీ కార్యదర్శిగా రాంబిల్లి మండలం నుంచి బదిలీపై వచ్చిన. బి సత్తిబాబును స్వాగతం పలుకుతూ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ధర్మిశెట్టి స్వాతి కొండబాబు, సచివాలయ సిబ్బంది(గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



కరపత్రాలు పంచుతూ మహాసభలపై ఇంటింటా ప్రచారం చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : వచ్చేనెల 20, 21తేదీల్లో సిపిఎం 24వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ నేతలు కోరారు. శుక్రవారం రామారావు పేట లో సిపిఎం బృందం ఇంటింటా తిరిగి, మహాసభల జయప్రదానికి ప్రచారం చేయడంతోపాటు విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడుతున్న సిపిఎం జిల్లా మహసభలు నర్సీపట్నంలో మొదటి సారిగా జరుగున్నాయని, వాటిని విజయవంతానికి సహకరించాలని కోరారు. సిపిఎం మహసభలు మూడేళ్ళకు ఒకసారి జరుతాయని, దీనికి ప్రజల నుండి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ప్రజా సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలు, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై మహాసభల్లో చర్చించి, తీర్మానాలు, నిర్ణయాలు చేస్తామన్నారు. కార్యక్రమాంలో సిపిఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి,ఎల్ గౌరి,కెవి సూర్యప్రభ, నాగిరెడ్డి సత్యనారాయణ, ఆర్ దేముడునాయుడు పాల్గొన్నారు.

పట్టాలిచ్చిన భూములను ఆన్‌లైన్ చేయండి



తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి- మాడుగుల : పేదలకు పట్టాలు ఇచ్చిన రెవెన్యూ అధికారులు వాటిని ఆన్‌లైన్ చేయడం మరిచిపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న, వి.మాడుగుల మండల కార్యదర్శి ఇరట.నరసింహమూర్తి కె. భవానీ అన్నారు.శుక్రవారం మాడుగుల తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒమ్మలి రెవిన్యూ పరిధిలో ఉరలోవ కోండ చుట్టు వి,జెపురం ఎం.కృష్ణాపురం,వమ్మలి, రావికమతం మండలం కోమిరి గ్రామాల్లో సుమారుగా 450 మంది గిరిజనులు, దళితులకు ఆరవ విడత భూపంపిణీలో పట్టాలు మంజూరు చేసిన అధికారులు ఇప్పటివరకు వాటిని ఆన్‌లైన్ చేయలేదన్నారు ఏళ్లతరబడి ఆయా భూములలో జీడి, మామిడి తోటలు వాటి ఫలసాయంలో జీవనోపాధిపొందుతున్నా, ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు కాకపోవడంతో వారికి బ్యాంకు రుణాలు, ఇతర ప్రభుత్వపథకాలు అందడం లేదన్నారు..వెంటనే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోని పేదల పట్టా భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు.

పాఠశాల భవనం స్లాబు పెచ్చులు పడి
విద్యార్థి తలకు గాయాలు



పాఠశాలను సందర్శిస్తున్న ఎంపిపి



గాయపడిన లక్ష్మణ్

ప్రజాశక్తి -గొలుగొండ : గొలుగొండ మండలం నాగన్న దొరపాలెం ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న రాయపురెడ్డి లక్ష్మణ్ అనే విద్యార్థిపై క్లాస్ రూమ్‌లో శ్లాబ్ పెచ్చులు పడి గాయాలయ్యాయి. విద్యార్థి తలకు బలమైన గాయమై, రక్తస్రావం కావడంతో హుటా హుటిన ఉపాధ్యాయులు చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎంపిపి గజ్జలపు మణికుమారి పాఠశాలను సందర్శించారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పాఠశాల మరమ్మత్తులకు తక్షణమే రూ. 2లక్షల మండల పరిషత్ నుంచి మంజూరు చేస్తామనిహామీనిచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వరహాలబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల పనివేళలు మార్చొద్దు

ప్రజాశక్తి- నక్కపల్లి : ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పనివేళలను మార్చకుండా, పాత పద్ధతిలో యధావిధిగా కొనసాగించాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కెకెఎల్ఎన్ ధర్మారావు అన్నారు. నక్కపల్లిలో శుక్రవారం సాయంత్రం ఎపిటిఎఫ్ మండల కార్యవర్గ సమావేశంలో ధర్మారావు మాట్లాడుతూ, జిఒ117 రద్దు చేయాలని, తక్షణమే ఐఆర్ ప్రకటించి, పిఆర్‌సి కమిషన్ నియమించాలని, ఆర్థిక అంశాలుతో కూడిన పెండింగ్ బిల్లులు తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేసారు. రాష్ట్ర కౌన్సిలర్ డి కొండల రావు, నక్కపల్లి అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు వై కృష్ణ, సి హెచ్ అప్పలరాజు, గౌరవాధ్యక్షులు ఎస్ ఫల్గుణరావు, ఉపాధ్యక్షులు డి. నరసింహమూర్తి, వై యేసు దేవుడు పాల్గొన్నారు.

పెదతీనార్లలో భూముల సర్వే చేపట్టొద్దు



ఆందోళన వ్యక్తం చేస్తున్న సిపిఎం నేత అప్పలరాజు, రైతులు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని పెదతీనార్ల రెవెన్యూ పరిధిలో రైతులకు సమాచారం ఇవ్వకుండా అధికారులు చేస్తున్న భూసర్వేను వెంటనే నిలుపుదల చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం రైతులతో కలిసి మాట్లాడుతూ రైతులకు, గ్రామస్తులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు భూములను సర్వే ఎలా చేస్తారని ప్రశ్నించారు. 2013 భూసేకరణ చట్టాన్ని ఉల్లంఘిస్తూ రెవెన్యూ అధికారులు భూములు సర్వే చేస్తున్నారన్నారు. తక్షణం నిలుపుదల చేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రైతులు, నాయకులు ఎం.సత్యనారాయణ, ఎం.రాజేష్, శివాజీ రాజు, ఎం.కొర్లయ్య, బుజ్జి, జబాది రాజు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కమిటీల ఎన్నిక



నక్కపల్లిలో ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ కార్యవర్గం

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి మండల యుటిఎఫ్ నూతన కమిటీ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా కోశాధికారి జె రాజేష్ ఆధ్వర్యంలో మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులుగా డిఆర్‌కె శాస్త్రి, ప్రధాన కార్యదర్శిగా జి మహేష్, గౌరవాధ్యక్షులుగా సిహెచ్ఎఎస్ఎన్ మూర్తి, సహాధ్యక్షులుగా బి నాగమణి, డి శివయ్య, కోశాధికారిగా కెవి. సత్యనారాయణ, కార్యదర్శులుగా వి సూరిబాబు, వి ఆశా భాను, ఎం ఎస్ ఎల్ ప్రశాంతి, పివిఎన్ ఎమ్ రాజేష్, జి రాజు, పి గణేష్ చంద్ర, జి ప్రవీణ్ కుమార్, ఎస్ హరి ప్రసాద్, ఎ.మోహన్, ఎం సత్యనారాయణ, ఏ శంకరరావు, పి దుర్గాప్రసాద్, అడ్‌హక్ కమిటీ సభ్యులుగా కె జయరాజ్, టీజే శ్రీపతి, జిల్లా కౌన్సిలర్లుగా జి రాజబాబు, పివి వెంకటరావు, మాడెం సత్యనారాయణ, పి శ్రీకాంత్, వై ఉమాదేవి, ఎం జె నాయక్, టి నానాజీ లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు.





డిఆర్‌కె.శాస్త్రి, మహేష్

కోటవురట్లలో...

కోటవురట్ల: యుటిఎఫ్ మండల కమిటీ కార్యవర్గాన్ని శుక్రవారం జిల్లా సహాధ్యక్షులు గాయత్రి, జిల్లా కార్యదర్శి సతీష్ ఏకగ్రీవంగా ప్రకటించారు, యుటిఎఫ్ మండల కమిటీలో గౌరవాధ్యక్షునిగా అడిగర్ల సత్యనారాయణ, అధ్యక్షునిగా జవ్వాది నరసింహరావు, ప్రధాన కార్యదర్శిగా జంగా ప్రసాదు, కోశాధికారిగా సంతోష్, సహ అధ్యక్షులుగా లావరాజు, క్రాంతి, జిల్లా కౌన్సిలర్ గా చిట్టియ్య ఎంపికయ్యారు. ఎంపికైన కమిటీ ప్రతినిధులతో ప్రమాణస్వీకారం చేయించి అభినందించారు.



కోటవురట్ల యుటిఎఫ్ కార్యవర్గం